# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్: (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web: www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

గూడూరి వెంకటరత్నం

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ ఎస్.రామతారక పరబ్రహ్మశాస్త్రి

మిస్.పి. ఇందిరాదేవి

డా॥ వి.వి.ఆర్. ప్రసాదరావు

డా॥ యమ్.స్వర్ణముఖి



Volume 31 Issue 3

No.of Pages 44

NOVEMBER 2011

| | | |
|---|---|---|
| 5సం॥లచందా | రు. | 250.00 |
| 2సం॥ల చందా | రు. | 120.00 |
| సంవత్సర చందా | రు. | 60.00 |
| విడిప్రతి వెల ..... .. | రు. | 5.00 |

బ్యాంక్ డ్రాఫ్ట్లు A/C.Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ పేరులో డ్రా చేయండి. M.O.,బ్యాంక్ డ్రాఫ్ట్స్ పంపవలసిన చిరునామా:

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్-522508

Printed, Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL


## ఈ సంచికలో....


| | పేజీ |
|---|---|
| భద్రవాక్యం | 2 |
| అమ్మఆశీస్సులు | 3 |
| బాబూజీ ఉవాచ | 5 |
| మాతాజీ అభిభాషణ | 7 |
| పొగడ్త ప్రభావం | 9 |
| సన్నిధిలో సంభాషణ | 10 |
| శ్రీకాళీగార్డెన్స్‌లో కార్యక్రమాలు | 12 |
| భక్తి విజయం | 14 |
| గురు కృపాహి కేవలమ్ | 16 |
| నేను అర్థం చేసుకున్న ధ్యానయోగం | 18 |
| శ్రీకృష్ణ కర్ణామృతం | 20 |
| పరిప్రశ్నేన సేవయా | 22 |
| కుంకుమ అక్షతల మహిమ | 23 |
| హనుమంతునికి అమనస్కఉపదేశం | 24 |
| బాబూజీ రాజయోగి | 26 |
| భగవత్సాక్షాత్కారము | 27 |
| శ్రీకృష్ణాష్టమి వేడుకలలో శ్రీమాతాజీ అనుగ్రహభాషణ | 29 |
| ఆహ్వానము | 31 |
| బాబూజీ మహోపదేశము | 32 |
| సమర్థ సద్గురు నాథుని దివ్యచరిత్ర | 34 |
| మౌనధ్యాన శిబిరం | 36 |
| బాబు తత్త్వమే తిరుప్పావై | 38 |
| అమెరికాలో మాతాజీ బోధ | 40 |
| శ్యామసుందరా! ఒక్కసారి! | 42 |

# భద్రవాక్యం

-పరాశర ప్రసాద్

**సత్సంగత్వే నిస్సంగత్వం। నిస్సంగత్వే నిర్మోహత్వం ।**
**నిర్మోహత్వే నిశ్చలతత్త్వం । నిశ్చల తత్త్వే జీవన్ముక్తిః ॥**

సాధకులు మనస్సుని స్వాధీన పరచుకోవాలంటే మనస్సుని సత్సంగంలో ఊరవేస్తే, దానియందు అనురక్తి కలిగి భగవంతుని గూర్చిన ఆలోచన ప్రారంభం అవుతుంది. సత్సంగంలో గడిపిన కాలం, నిత్యకాలంలో జమ అవుతుందని గురుదేవులు చెబుతూ ఉండేవారు. సత్సంగం అంటే సత్యవస్తువుతో కూడి ఉండటం అన్నమాట.

సత్యం మాటలకి అందేది కాదు. మాటలు బంధాన్ని తెస్తాయి. కాని సత్సంగంలోని మాటలు సత్యాన్ని అన్వేషించే మార్గాన్ని సూచించటమే కాక దానిని పొందే మార్గాన్ని సుగమం చేస్తాయి.

మనము ఆత్మ వస్తువులోనే ఉన్నాము. మనస్సు రాగ ద్వేషాలతో కూడి ఉన్నంత వరకు అశాంతి తప్పదు. మహాత్ములు అవతరించి ప్రబోధించేది ఎవరి కోసం? వారికి స్వార్థంగాని, సంకల్పాలుగాని, బంధనగాని ఉంటాయా?

సత్సంగాలు మనల్ని మనం ఉద్ధరించుకోవటానికే అనే విషయం సాధకులంతా గ్రహించాలి. సత్సంగంలో పదిమందితో కలసి ఉన్న సద్భావన పెంపొందుతుంది. అదే నిజమైన నిస్సంగత్వమంటే. మనస్సులో సదాలోచన సత్సంగము. దురాలోచనే దుస్సంగము.

సత్సంగము మనస్సులోని నానత్వ భావనని తొలగించి, నిశ్చల స్థితికి తీసుకువెళ్తుంది. సత్సంగంలో మహాత్ముల బోధను శ్రవణం చేసి, మననం చేస్తే నిదిధ్యాసకి తప్పక వస్తుంది. ఆ స్థితిని సాధించిన సాధకుడు పరమపద సోపానము అధిరోహణ చేయు త్రోవలోనే ఉంటాడు.

**పరాశర ప్రసాద్**
**గౌరవ సంపాదకులు**

# అమ్మ ఆశీస్సులు

ఉపనిషత్కాంతామృదూక్తు లాకర్ణించి
కనుగీటినాడు శృంగారరసము
శుష్కవేదాంత వస్తు ప్రదర్శన కుతూ
హలమహోదరులపై హాస్యరసము
ప్రబల భక్తిజ్ఞాన వైరాగ్యము ల్గల్గి
వరలు సాధకులపై గరుణరసము
ఈషణత్రయము పేరింటి బంధమ్ముల
పరపరంగోయు బీభత్సరసము
కామాదిరిపులపైగనలి సర్వేంద్రియ
విజయముం బొందుచో వీరరసము
నాపదలం జిక్కి నల్లాడు భక్తుల
న్గనుగొనుచో భయానకరసంబు
పైనుండి క్రిందికి బడద్రోయు నహమను
రక్కసిం గూల్చునో రౌద్ర రసంబు
సహకారివై యొకే సమయాన పెక్కు తా
వుల గోచరించ యద్భుతరసమ్ము
లెక్కసేయక లెక్కలేని నిందెలమోపు
జనసమూహమ్ముపై శాంతరసము

జూపితివి, గుప్తమూర్తివి శుభ కరుండ
వందు మూడవదానిని నాయందు జూపు
మనుచు వేడుచుంటి నిన్నాశ్రయించి
సత్యమోహన కాళీప్రసాద బాబూ!

శ్రీసద్గురుదేవులే శ్రీపరిమి సుబ్రహ్మణ్య భాగవతార్ కవిగారిలో చేరి వ్రాయించి, మనకందించిన అక్షర సత్యాలు. శ్రీస్వామివారు

మనందరి యందు కరుణరసమును వర్షిస్తున్నారు కనుకనే ఇలా ఉండగలుగుతున్నాము. అట్టి గురుమూర్తి ఈ భువిలోన లేడు అని మరొక చోట తెలియజేశారు. ఉన్నాడు, లేడు అని, ఉన్నది, లేదు అని ద్వంద్వ రహితుడు.

**నిష్కళంకో, నిరంజనో, నిర్వికల్పో, నిరాఖ్యాత శుద్ధోదేవఏకో నారాయణః** అట్టి మహానారాయణుడు మహామహానుభావుడు, మనకందిన గురుపాదము సద్గురుపాదము అంత గొప్పది. అట్టి మహారాధన పుణ్యారాధనలో పాల్గొని యీ జీవితమును ప్రసాదించినందుకు సద్వినియోగపరచుకోవాలి.

గురుడన్న సామాన్య నరుడు కాదు. నరునిలోని నారాయణుని, మానవునిలోని మాధవుని, జీవుడిలోని శివుని గుర్తింపజేసేవారే సమర్థ సద్గురుదేవులు.

ఈ నెల 13వ తేదీ నుండి 21వ తారీఖు వరకు ప్రాతఃకాలములో మహామంగళ హారతులివ్వటంతో శ్రీసద్గురుదేవుని 23వ మహాపుణ్యారాధన కార్యక్రమాలు పరిసమాప్తి అవుతాయి.

ముందుగా 10వ తారీఖున (కార్తీక పూర్ణిమ) శ్రీగురుపూర్ణిమ కూడ ఎంతో వైభవముగా చేసుకొనే అవకాశం శ్రీసద్గురుదేవులు అందరికీ అందిస్తున్నారు.

మనమందరమూ కలిసి అన్ని కార్యక్రమాలు సమిష్టిగా చేసుకుని తరింతుము గాక! అట్టి శక్తిని, భక్తిని, అఖండ సాధనా సంపత్తిని శ్రీసద్గురు దేవులు మనకు ప్రసాదించెదరుగాక!!

శ్రీసద్గురుదేవుల సేవలో
మీ అమ్మ.

# బాబూజీ ఉవాచ

- వెంకట రమణ ప్రసాద్



గోపన్న అతిథులకూ, అభ్యాగతులకూ నిరతాన్నదాత. ప్రతిరోజూ గుండిగలతో వండే అన్నం వార్చటం కోసం వెతుక్కోకుండా వారి వంటయింటి సమీపంలో ఒక గంజి గుంట తవ్వించాడు. ఒకనాడు గంజి వార్చిన తరువాత గోపన్న కుమారుడు పొరబాటున కాలుజారి గంజిగుంటలో పడి, ఆ వేడికి అక్కడికక్కడే మరణించాడు.

ఇప్పుడు గోపన్నకొక యిబ్బంది వచ్చింది. కుమారుడు చనిపోవటం దుఃఖకారణమే. అది ప్రారబ్దం. తప్పింపనలవి కానది. కాని యీ వార్త తెలిస్తే, భోజనానికి బారులు తీర్చి కూర్చున్న నైష్ఠికులను భోజనం చెయ్యకుండా లేపటం ఎంత పాపం?

అందుచేత గోపన్న తన భార్యతో ఆలోచించి తన కుమారుడి మరణవార్త పైకి పొక్కకుండా జాగ్రత్తపడ్డాడు. ఆ మహాసాధ్వి కూడా పుత్ర శోకంతో దహింపబడుతున్నా, అతిధులనూ అభ్యాగతులనూ దృష్టిలో పెట్టుకుని తనను తాను నిబ్బరించుకుంది. అంతేకాదు భార్యాభర్తలిరువురూ ఏమీ జరుగనట్లే చిరునవ్వు ముఖాలతో పంక్తుల మధ్య తిరుగుతూ అతిధులకు సంతృప్తిగా కొసరి కొసరి వడ్డించసాగారు. వాళ్ళ మొఖాలు చూచిన వాళ్ళెవరికీ వాళ్ళిద్దరూ పుత్రశోక బాధితులనే విషయమే స్ఫురించనట్లుంది వాళ్ళ ప్రవర్తన.

అతిధులంతా భోజనాలు చేసి లేచిన తరువాత, గోపన్న తన కుమారుడి తాలూకు మృతదేహాన్ని గురుదేవుడైన కబీరు పాదాల దగ్గర పెట్టి జరిగిన విషయం విన్నవించాడు. కనురెప్పలనే ఒడ్డులనొరసుకుంటూ దుఃఖ స్రోతస్విని మహాప్రవాహంగా ఉద్భవించి కబీరు పాదపద్మాలను అభిషేకించింది.

"నాయనా! రామదాసూ! నీ కుమారుడు చిరంజీవి. అతడు అంబుజోదర దివ్యపాదారవింద చింతనామృత పాన విశేషమత్తుడే కాని, మరణించలేదు. బంగారానికి పుటం పెడితే ఎక్కువ ప్రకాశించినట్లు, గంజిగుంటలో పడిన నీ కుమారుడి పూర్వజన్మార్జిత కర్మఫలం అంతా నశించి,

బంగారంలా ధగద్ధగాయమానంగా ప్రకాశిస్తున్నాడు. ఇకపైన అతడు మేలిమి బంగారంగా ప్రకాశిస్తాడు. మనం అందరం ఆ రామ ప్రభువునే ప్రార్థిద్దాం. ఆయన తన భక్తులను ఆపద సమయాలలో ఆదుకోకుండా ఎలా ఉండగలడు?'' అన్నాడు కబీరు.

తన మధురమైన గాత్రంతో నామ సంకీర్తన ప్రారంభించాడు కబీరు. రామదాసూ, అతని భార్యా శృతి కలిపారు. వాళ్ళు మైనరచి సంకీర్తన చేస్తూ ఉండగా వాళ్ళతో యింకో గొంతు కలిసింది. ఎవరా అని చూడగా మరణించిన పసివాడు లేచి కూర్చుని సంకీర్తన చేస్తున్నాడు. అదే గురు కటాక్షం. **'అనన్యాశ్చింతయన్తోమాం యే జనాః పర్యుపాసతే తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహం'** అన్న తన వాగ్దానాన్ని ఆ ప్రభువు నిలుపుకోకుండా ఉంటాడా?'' గురుకటాక్షమంటే అది కాదా?

గోపన్న మనస్సు భగవత్పాద పద్మాలలో లయించింది. ఆయన వృత్తిచేత భద్రాచలం తాలూకా తహసీలుదారు. అప్పుడు ఆ దేశానికి రాజు గోల్కొండ నవాబు తానీషా. భద్రాచలం రామాలయం చాలా శిథిలావస్థలో ఉండటం చూశాడు రామదాసు. అతని మనస్సు క్షోభించింది. "ఈ ప్రపంచం అంతా నీ సృష్టి అయినప్పుడు, యిందులోని సమస్తమూ నీదేకదా! ఈ తాలూకా శిస్తు పైకం నీ ఆలయ పునర్నిర్మాణానికే వినియోగిస్తాను'' అనుకున్నాడు రామదాసు. దానికి ప్రభువైన తానీషా అంగీకారం అవసరమని కూడా ఆయనకు తోచలేదు. శిస్తు వసూళ్ళలో నుంచి ఆరులక్షల రూపాయలు ఖర్చు చేసి చక్కగా రామాలయాన్ని పునర్నిర్మాణం చేసి ధన్యుడయ్యాడు రామదాసు.

అయితే భౌతిక దృష్టితో చూస్తే అది నేరంలానే కనిపిస్తుంది. రామదాసు ఖజానా డబ్బు వాడుకున్నాడని తెలిసి క్రుద్ధుడైనాడు తానీషా. గోపన్నకు కఠిన కారాగార శిక్ష విధించాడు.

-సశేషం

---

**అగాధమైన జలనిధిలో అడుగు పోయినవాడే అమూల్యమైన ముత్యాల కోవలను తనవి చేసుకుంటాడు. పయోధిలోనికి ప్రవేశించే ధైర్యం లేక తీరాన కూర్చుని అంగలారుస్తున్నాను.**

**- కబీర్ దాస్**

---

# మాతాజీ అభిభాషణ

(గత సంచిక తరువాయి) -జపమాల ప్రసాద

"ఏ అనంతశక్తి గురించి మనం ఇంతసేపు చెప్పుకుంటున్నామో, ఆ శక్తే, ఆ పరబ్రహ్మవస్తువే నువ్వుగాని బయటకి కనిపిస్తున్న బొమ్మ నువ్వు కాదురా" అని మహాత్ములు మనకి చెవులో ఇల్లు కట్టుకుని చెప్తున్నారు. శ్రీఆదిశంకర భగవత్పాదులవారే తమ "మనీషా పంచకమ్" లో యీ విధంగా చెప్పారు.



"బ్రహ్మైవాహమ్! ఇదమ్ జగచ్చ సకలమ్।
చిన్మాత్ర విస్తారితమ్।
సర్వమ్ చైతత్। అవిద్యయా త్రిగుణయా। శేషమ్ మయా కల్పితమ్।
ఇత్థమ్ యస్య దృఢామతి స్సుఖతరే । నిత్యే। పరే నిర్మలే।
చండాలోస్తు। సతు ద్విజోస్తు। గురురిత్యేషా మనీషా మమ॥"

'నేను బ్రహ్మనే. ఈ జగత్తంతా కూడా 'చిత్' అంతే చైతన్యం తోనే విస్తారితమై ప్రకాశిస్తోంది. మరి ఈ చిత్ర విచిత్రమైన జగత్తు ఎలా కనబడుతోంది అంటారా! అది కేవలం త్రిగుణముల వలన, అవిద్యవలన, అశేషంగా సృష్టించుకుంటున్నాము. తెల్లని కాంతి ప్రసరిస్తూ వుంటే, దానికి ఒక త్రికోణములు కలిగిన గాజు పట్టకాన్ని అడ్డంపెడితే, ఆ పట్టకాన్ని దాటేసరికి, తెల్లని ఏక కాంతే మనకి ఏడు రంగులుగా కనిపిస్తుంది. అడ్డు తీసేస్తే ఉన్నది తెల్లటి కాంతే. ఉన్నది బ్రహ్మము ఒక్కటే. అదే 'అహమ్' (నేను). దానికి త్రిగుణాత్మకమైన మాయా శక్తి అడ్డు వచ్చేసరికి, చిత్ర విచిత్రములైన నానారూపాలతో కూడిన జగత్తు కనిపిస్తోంది. 'జగత్తు' అంటేనే, జ = జనించి (పుట్టి), గ = గతించేది అని అర్థం. అయితే ఈ జనించి, గతించే జగత్తుకి ఆధారం మాత్రం 'త్' = తత్ వస్తువే - అంటే ఆ పరబ్రహ్మవస్తువే లేక ఆత్మయే. ఈ విధంగా ఎవరయితే దృఢమతితో, నిర్మలమైన మనసుతో నిరంతరం చింతన చేస్తూ, ఆ ఎరుకలోనే నిలిచివుంటారో, బొమ్మ 'నేను' కాదు, బ్రహ్మనే 'నేను' అని తెలుసుకుంటారో, అటువంటి వాడు చండాలుడే

అయినా ద్విజుడే (బ్రాహ్మణుడు) అయినా, అతడే నిజమైన గురువు అని నా దృఢమైన నమ్మకం, అని శ్రీ శంకర భగవత్పాదాచార్యులవారు మనకి బోధ చేశారు. మనో ప్రవృత్తిని బట్టి జాతి, వర్ణాలని సృష్టించారు గానీ, బ్రహ్మభావనలోనే వుంటే ఏ భావమూ లేదు. చతుర్వర్ణాలు కూడా అంతే. ప్రవృత్తిని బట్టి వారు వీరవుతూ వుంటారు.

ఆత్మానుభూతి అనేది రహస్యంగానే ఇస్తారు సద్గురునాథులు. హృదయాకాశంలో ప్రకాశించే పరమాత్మని అంతరంగానే ఆరాధించాలి. మానసికంగానే స్మరించాలి. ఈ పంచభూత నిర్మితమైన దేహంలోనే వుండి, దానిని ప్రకాశింపచేస్తున్నది ఏదయి వుంది? అసలు 'నేను' అదే. "అహమ్ త్యక్త్వా అహమస్మ్యహమ్'' అని చెప్తోంది ''రామ తాపన్యుపనిషత్''. అహంకారాన్ని విడిస్తే, కారం పోయి 'అహమ్' మిగులుతుంది. అది తెలుసుకోవాలి. ఆ సత్యాన్ని తెలుసుకోనీకుండా మనకి మూడు అడ్డులున్నాయి. అవి - దేహోహం, జీవోహమ్, ఆత్మాహమ్, అనే భావనలు. నేను ఈ కనిపించే దేహాన్నే అనుకోవడం 'దేహోహం' భావన; నేను జీవుడిని అనుకోడం 'జీవోహమ్; 'నేను ఆత్మని' అనుకోడం 'ఆత్మాహం' భావన. మరి వీటిని దాటడం ఎలా?

ఈ విధంగా ఆంజనేయ స్వామికి జగన్మాత అయిన సీతామాత ఆత్మతత్వాన్ని (రామతత్వాన్ని) బోధ చేసింది!. "నాయనా! మరి నీ అనుభవ మేమిటి;'' అనిఅడిగాడు రామచంద్రుడు. సద్గురు మూర్తికూడా, ఒక అనుష్ఠానం చెప్పి - 'ఇదిచేయి. ఇప్పుడెలా వుందో చెప్పు' అనేవారు. ఇలా వుంటాయి గురుదేవుల దగ్గర అనుభవాలు. వారి స్సాన్నిధ్యంలో వుంటే అలా అడుగుతూ వుంటారు. అందుకే శిష్యుడెప్పుడూ, స్వాతి చినుకు కోసం ఎదురు చూసే ముత్యపు చిప్పలా వుండాలి. నిరంతరం గురువాక్యం కోసం ఎదురుచూడాలి. వారు సూచనలనందిస్తారు. అవి అందుకోవాలి. బీజాక్షరాలతో కూడిన మంత్రాన్ని ఉపదేశిస్తారు. అది గ్రహించి, ప్రశాంతంగా లోతుకి వెళ్ళిపోవాలి. సముద్రం లోతుకి వెళితే ముత్యాలు, రత్నాలు లభిస్తాయి. భక్తుల హృదయ ముత్యాలని ధరించేవాడు భగవానుడొక్కడే.

-సశేషం

# పొగడ్త ప్రభావం

- సుశీలా ప్రసాద

జీవకళ ఉట్టిపడేటట్లు శిల్పాలు చెక్కే అత్భుత చాతుర్యంగల ఒక శిల్పికి ఒకనాడొక జ్యోతిష్కుడు తటస్థపడి, నాటి అర్ధరాత్రి వాని ఆయువు ముగిసి పోతుందని చెప్పాడు. ఆ క్షణం గడిచిపోతే చావు నుంచి తప్పించుకునేందుకు శిల్పి ఒక తెలివైన ఆలోచన చేశాడు.

రూపరేఖా విలాసలతో అచ్చు తన పోలికలున్న, తన నుండి వేరుచేసి కనిపెట్టలేనంతగా, తనలాంటి నాలుగు బొమ్మలను తయారు చేశాడు. సమయం ఆసన్నమవుతుండగా తనకి చెరొకవైపు రెండేసి బొమ్మలను పెట్టుకుని ఊపిరి బిగించి పడుకున్నాడు.

కాలుని ఆజ్ఞానుసారం యమదూతలు వాని ప్రాణం తీసుకు పోవటానికి వచ్చారు. ఎవరు అసలు, ఎవరు నకిలీ అని అన్నది కనిపెట్టలేక శిల్పి చతురతకు అబ్బురపడి నిలబడిపోయారు. విధినెవ్వరూ తప్పించలేరు కనుక వారికప్పుడొక దారి దొరికింది.

"ఆహా! ఈ శిల్పి చాతుర్యం బ్రహ్మాండమైనది కదా! బ్రహ్మదేవుని మించిపోయి సృష్టించాడండి. ఇందులో అసలువాడెవడో అంతు చిక్కకుండా ఉందే! కాలుని కూడా గెలువగల తెలివి తేటలున్న గొప్పవాడు గదా ఇతగాడు" అంటూ యమదూతలు స్తుతి వాక్యాలు పలికేసరికి, ఆ పొగడ్తలు వింటూ పొంగిపోతూ మానవ నైజం గనుక వారి మాటలకు శిల్పి ముఖంలో ఆనందం తాండవించి, బుగ్గలు ఎర్రబడి పెదవులపై చిరునవ్వు విరిసింది.

జీవం లేక, భావ ప్రకటన చేయలేని బొమ్మల నుంచి, తేడాగా ఉన్న శిల్పిని గుర్తించిన యమకింకరులు వాని జీవాలను చటుక్కున హరించి కార్యం సాధించి తమ లోకానికి తీసుకుని పోయారు.

'**తుల్యనిందా స్తుతిర్మౌని**' అని జగద్గురువైన గీతాచార్యుడు ప్రవచించినట్లు నిందకు కుంగక, స్తుతికి పొంగక నిందాస్తుతులను సమానంగా స్వీకరించేవారు మహాత్ములు మాత్రమే!

■

# సన్నిధిలో సంభాషణ

(గత సంచిక తరువాయి)

- పరాశర ప్రసాద్

**9-6-1985**

ఈ రోజు ఉదయం శ్రీబాబు భక్తులకు బోధ చేస్తుండగా ఒక భక్తుడు ప్రశ్నిస్తూ 'రూప, నామ, క్రియారహితుడైన భగవంతుణ్ణి మనం ఆరాధించి, పూజించి, ధ్యానించటం వలన మనకి వచ్చే ఫలితం ఏమిటి?' అన్నారు.

శ్రీబాబు సమాధానం చెబుతూ మీకు ఈ ఉపమానం ఇదివరలోనే చెప్పాను. అయినా ఇంకోసారి చెప్పుకోవటంలో తప్పులేదు. రోజూ తినే ఇడ్లీ ఎన్నిసార్లు తిన్నా, కాఫీ ఎన్నిసార్లు త్రాగినా విసుగురాదు కాని తత్త్వం పేరు చెప్పేసరికి రోజూ చెప్పేదేగా అని నిర్లక్ష్యం చేస్తారు. రోజూ విన్న విషయమే అయినా విచారణ చేస్తే దాంట్లో నూతనత్వం బయటపడుతుంది. చూడండి! మన భక్తుడు సందేహం వెలిబుచ్చాడు. ప్రశ్న వేయటం వలన వచ్చే బోధ అందరికీ ఉపయోగపడుతుంది. బోధలో ఉండే మంచిని గ్రహిస్తే ధన్యత్వాన్ని పొందుతారు. కొన్ని సందర్భాలలో ప్రశ్నవేసిన వాడికి బోధలోని కొన్ని విషయాలు మనస్సుని కష్టపెట్టవచ్చు. అందువలననే కాబోలు భగవంతునికి గంధము అంటే అత్యంత ప్రియమైనది. గంధము తాను దగ్ధం అయిపోయినా అందరికీ సుగంధాన్ని అందజేస్తుంది అన్నారు.

శ్రీబాబు ఇంకా మాట్లాడుతూ మానవుడు ఏ పని చేసినా స్వార్థం లేకుండా చేయడు కదా! వ్యాపారం చేస్తున్నావనుకో దానిలో లాభం వస్తేనే ఉత్సాహం, శ్రద్ధ. వ్యాపారంలో ఒక లక్షరూపాయలు పెట్టుబడి పెడితే 10,000 లాభం రావాలి అనుకుంటాడు. దీంట్లో ఒక విశేషం ఉంది. వ్యాపారం శ్రద్ధగా చేస్తేనే లాభం వస్తుంది. ఉదయాన్నే నిదుర లేచి దుకాణానికి వెడితేనే గుమాస్తాలు కూడా సక్రమంగా వస్తారు. అలాకాకుండా 10గంటలకు నిద్ర లేచి, 12గంటలకు దుకాణానికి వెళ్ళి, తిరిగి 2గంటలకు ఇంటికి వచ్చి నిదురపోయి సాయంత్రం 5గంటలకి వెళితే ఎంత పెట్టుబడి పెట్టినా ఏం లాభం? ఇది కొంతవరకు చెప్పుకోవచ్చు. ఇంతకన్న సోమరులు ఉంటారు.

వారు వ్యాపారాన్ని యావత్తూ గుమాస్తాలకే వదిలి వారు మాత్రం ఏ చతుర్ముఖ పురాణంలోనో, లేక గ్రామ రాజకీయాలలోనో తలమునకలై ఉంటారు. వారికి లాభాలు రమ్మంటే ఎలా వస్తాయి? వారికి ఒకటి ప్రక్కన సున్నాలు కాదు వచ్చేది సున్నాల ప్రక్కన ఒకటి మాత్రమే.

సోమరితనంతో సాధనచేసి అజ్ఞానం నశించాలంటే ఎలా సాధ్యపడుతుంది? ఇటువంటివాడు ప్రశ్నిస్తాడు ధ్యానం వలన మనకు సుఖం ఏమిటి? ఫలితం ఏమిటి? భగవంతుణ్ణి నమ్మినందుకు వ్యాపారంలో కూడా నష్టపోయామే అంటాడు. పెట్టుబడి పెట్టిన వ్యాపారంలోనే శ్రద్ధ చూపనివాడు ఇంక భగవంతుని విషయంలో ఏం శ్రద్ధ చూపిస్తాడు? కాని ఒక్కటి మాత్రం సత్యం. భగవంతుణ్ణి సాకారంగా దర్శించినవారు అనేక మంది ఉన్నారు. అంతకన్న ఉన్నత స్థితికి ఎదిగి ఆయన నిర్గుణ తత్వాన్ని తెలుసుకుని పరిపూర్ణ ఆనందాన్ని పొందినవారు ఉన్నారు. ఏ ఆనందం లేకపోతే తమ సర్వస్వాన్ని త్యాగం చేసి ఎన్ని కష్టాలు వచ్చినా వాటిని అధిగమించి పరమాత్మ తత్త్వం తెలుసుకోవాలి అని ఎందుకు కృషిచేస్తారు?

ఇక్కడ ఇంకొక విశేషముంది. కొంతమంది తెలిసీ తెలియనివారు గృహస్థుడు సన్యసించనిదే మోక్షాన్ని పొందలేడని, భగవంతుడి దయని అందుకోలేడని, పరమాత్మని చేరాలంటే మన వేషం మారాలనో, తల వెంట్రుకలు ఉండకూడదనో, కాషాయం ధరించాలనో బోధిస్తారు. కాని గృహస్థుడికే భగవంతుణ్ణి చేరుకునే మార్గం దగ్గరగా ఉంటుంది. రాజయోగం చాలా షార్ట్‌కట్. ముక్కుని తిన్నగా చూపినట్లు. అదే సన్యాసి అయితే ముక్కుని త్రిప్పి చూపినట్లు అవుతుంది. గృహస్థునికి తన తప్పుని దిద్దుకునే అవకాశం ఉంది. సన్యాసికి అటువంటి అవకాశం లేదు. రైలు స్టేషన్‌లో పట్టాలు తప్పితే జాకీతో పైకి ఎత్తి తిరిగి పట్టాల మీద పెట్టవచ్చు. కాని అదే రైలు గోదావరి బ్రిడ్జి మీద పట్టాలు తప్పితే ఏమవుతుంది? నదిలో పడుతుంది. దానిని రక్షించేవాడు ఎవడు? కాబట్టి గృహస్థుకి మోక్షార్హత లేదని ఏ గ్రంథం చెప్పలేదు. సన్యాసి వేషధారణ చేసినంత మాత్రం చేత భగవంతుని దర్శించ లేడు. మరి ఏం చేస్తే భగవంతుని దర్శించ గలుగుతావు? మనస్సు సన్యసించినట్లయితే అది సాధ్యపడుతుంది అన్నారు శ్రీబాబు.

-సశేషం

## శ్రీకాళీగార్డెన్స్‌లో విశేషపూజా కార్యక్రమములు

**నవంబరు 2011**

**7** సోమ ద్వాదశి శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

10 గురు గురుపూర్ణిమ, శ్రీగురునానక్ జయంతి, శ్రీ సద్గురు పాద పూజ, సత్సంగం, భక్త సమారాధన, సాయంకాలం జ్వాలాతోరణం, శ్రీ మహాకాళికా పరమేశ్వరీ రామలింగేశ్వరుల నగర దర్శనోత్సవం.

చాతుర్మాస్య దీక్షా విరమణ

**నవంబరు 13 ఆదివారం నుండి 21 సోమవారం వరకు శ్రీ గురుదేవుల త్రయోవింశతి వార్షిక పుణ్యారాధన మహోత్సవాలు**

13 ఆది ఉదయం పంచ యజ్ఞ సహిత పుణ్యారాధన మహోత్సవ సాప్తాహ్నిక దీక్షా స్వీకరణ, పంచ యజ్ఞ ప్రారంభం. ప్రతిరోజు ఉదయం 8 గం.లకు శ్రీ రామ తారక పరబ్రహ్మ ప్రసాద్, శ్రీ వెంకటరమణ ప్రసాద్ గార్లచే శ్రీ గురుగీతా ప్రవచనము.

13 నుండి - 20వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 4 గం.లకు సుప్రభాతం, నగర సంకీర్తన5 గం.లకు ప్రాతఃకాల ప్రార్థన, మహామంగళహారతి. 6గం.లకు బ్రహ్మశ్రీ కొండూరు రామ సుబ్రహ్మణ్యం గారిచే వేద పఠనము, ఆలయ దర్శనములు, తీర్థ ప్రసాదములు

13 - 20 వరకు మధ్యాహ్నం శ్రీసద్గురు శత సహస్ర నామార్చనము, మహామంత్ర పుష్పము, దర్బారు. తీర్థ ప్రసాద వితరణ. భక్త సమారాధన సాయంత్రం 6 గం.లకు ప్రార్థన మహా మంగళహారతి

14 - 19 వరకు ఉదయం 9 గం.లకు సత్సంగ సమావేశము, శ్రీ మాతాజీవారి అనుగ్రహభాషణ సద్గురుదేవుల దర్శనము,బోధ (వీడియో).శ్రీ బాబూజీ మహరాజ్ వాడిన వస్తువుల మ్యూజియమ్ ప్రదర్శన (అర్థగంట)

17 గురు రాత్రి 7గం.లకు నౌకా విహారం.

18 శుక్ర ఉదయం 7గం.లకు సామూహిక సద్గురు పూజలు. రాత్రి 7గం.లకు శ్రీసద్గురుదేవుల ఊంజలసేవ (డోలోత్సవము).

20 ఆది శ్రీ గురుదశమి, ఉషఃకాలం. 3 గం.లకు శ్రీ సద్గురుదేవులకు రుద్ర, నమక చమక సహిత మహాభిషేకము, శ్రీ సద్గురు పాదపూజ.

రాత్రి 7 గం.లకు శ్రీ సద్గురుదేవుల మహాపుణ్యారాధన.

**21** సోమ . ఉదయం శ్రీ సద్గురు పాదపూజ, దీక్షావిరమణ, మహామంగళ హారతి. స్వామివారి నగరోత్సవము.

**గమనిక** -పెద నిండ్రకొలను ఆశ్రమశాఖలో శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన, సత్సంగం, తెప్పోత్సవం.

23 బుధ మాసశివరాత్రి

30 బుధ శ్రీ సుబ్రహ్మణ్యషష్టి, శ్రీ సుబ్రహ్మణ్యస్వామివారికి అభిషేకము, సహస్రనామార్చన.

**డిశంబరు 2011**

3 శని శ్రీ సద్గురుదేవులు ఆంగ్ల కాలమాన ప్రకారం స్వస్వరూపలయం పొందిన రోజు, శ్రీ సద్గురుపాదపూజ, భక్త సమారాధన.

6 మంగళ గీతా జయంతి

10 శని పూర్ణిమ, దత్తాత్రేయ జయంతి, శ్రీ సద్గురు పాదపూజ

**17 శని నుండి ధనుర్మాస కార్యక్రమాలు** - ఉదయం 9.30 గం,లకు సంకీర్తన, 10 గం. లకు తిరుప్పావై, 10.30 గం.లకు ఋషుల చరిత్ర, 11 గం.లకు శ్రీమదాంధ్ర మహాభాగవత ప్రవచనము, సత్సంగం, ప్రార్థన, తీర్థ ప్రసాదములు.

20 మంగళ గురుదశమి, సత్సంగం శ్రీ సద్గురు పాదపూజ

23 శుక్ర మాసశివరాత్రి.

25 శని క్రిస్మస్ - శ్రీసద్గురు పాదపూజ. సత్సంగం.

***గమనిక***- *గతసంచికలో కాళీగార్డెన్స్ కార్యక్రమాలలో 20వ తారీఖున జరుగవలసిన అభిషేక కార్యక్రమాన్ని పొరపాటుగా 21గా ముద్రితమైనందులకు చింతిస్తున్నాము.*

సంతోషమనేది ఒక మంచు చినుకు వంటిది. వింతవింతగా అది నవ్వుతూనే అంతమైపోతుంది. దానికి నిలకడే లేదు. అంత బలవంతమైనది. దానికి అంతమనేది ఎరుగదు. కనుక దైవ చింతన నీ కళ్ళల్లో నాట్యం చెయ్యనీ.

- రవీంద్ర నాథ టాగూర్

## భక్తి విజయం

- సుశీలా ప్రసాద

**శ్లో॥ శ్రద్ధైవ సర్వలోకస్య మాతేవ హితకారిణీ ।**

సర్వజనులకు శ్రద్ధ, విశ్వాసము తల్లివలె హితము సమకూరుస్తుంది.

"తను లేచినవేళ ఎటువంటిదో! అడివంతా వెదికినా తాననుకున్నది కనిపించలేదు. ఈరోజు వేటకోసం పాంచాల రాజకుమారుడు సింహకేతువు బలవంతులైన భటులతో అడవిలోకి వచ్చాడు. తాను అతని సేవకుడైన కారణాన అతనికి అపురూపమైన జీవాన్ని వేటాడిపట్టి తీసుకువెళ్ళి కానుకగా యిచ్చి, అందుకు అతడిచ్చే బహుమతులను సంపాదించాలనుకున్నాడు. తానెంత దురదృష్టవంతుడు!" చండకుడు ఆలోచనలతో తిరిగి తిరిగి ఉన్నందున అలసటతో, కాస్సేపు సేద తీర్చుకునేందుకు తగిన తావుకోసం చుట్టూ చూశాడు. దగ్గరలోనే ఒక శిథిలమైన మందిరం కనిపించింది.

త్వరగా అక్కడికి చేరుకుని అడుగు లోనికి పెట్టి చూస్తే, అది శివాలయం! తన కళ్ళబడిన దృశ్యానికి అతడు విస్తుపోతూ నిలచిపోయాడు. అతని చూపుకెదురైనది పీఠం నించి విడిపోయి, నేలమీద పడి ఉన్న శివలింగం! అది అతి సుందరంగా ఉంది. ఆ లింగాన్ని చేతిలోకి తీసుకునేసరికి ఆ స్పర్శతో వానికి ఒళ్ళంతా పులకరించింది. పామరుడైన నీచ కిరాతజాతివానికి తనకి పరమపావనమైన ఆ శివలింగం లభించటం తన పూర్వజన్మ పుణ్యఫలమేమో! తానింతకు ముందు అనుకున్నట్లుగా దురదృష్టవంతుడు కానేకాదు. ఇప్పుడు మహా అదృష్టవంతుడు అనుకుంటున్న వాని మనస్సులో ఎన్నెన్నో ఆశలు! కోర్కెలు!

రాజకుమారుడు సింహకేతువు తాను విడిది చేసిన బసలో ఆప్తులైన మిత్రులతో ముచ్చటలాడుతున్నాడు. సేవకుడొకడు వచ్చి కిరాతుని రాక తెలిపాడు. రాజు అనుమతిపై లోనికి వచ్చాడు చండకుడు. వినయంగా వంగి నమస్కరించాడు. "ప్రభూ! ఈ అడవిలో ఒక జీర్ణమైన శివాలయంలో ఈ అందమైన శివలింగం నాకు దొరికింది. నా శక్తివంచన లేకుండా రోజూ నేను యీ శివుని పూజించుకుంటాను" అన్నాడు. చండకుని మాటలు వింటూ రాజకుమారుడు వాని చేతిలోని శివలింగాన్ని చూశాడు. కిరాతుడా!

శివపూజా! హేళనగా తోచింది. ఎదుటివారిని కించపరచటంలో నేర్పరి అయిన అతడు పరిహాసంగా, "అయితే ఏమంటావు? నీవందుకు తగినవాడివేనంటావా?" అన్నాడు.

చండకుని మనస్సుకు నొప్పి తగిలింది. అయినా ఉత్సాహంగా "రాజేంద్రా! మహారాజైన తమరు అనేక దేవాలయాలలో పూజలు చేయిస్తుంటారు. బాగా చదువుకున్న వారు ఏ మంత్రాలతో పూజలు చేస్తే శివుడు సంతోష పడతాడో, ఆ వివరాలన్నీ తెలిసినవారు తమరు. దయచేసి ఆ పద్ధతిని నాకు చెప్పండి" అని ప్రార్థించాడు.

వాని మాటలు వింటూ రాజకుమారుడు తన మిత్రుల మొహాలవంక చూశాడు. వారందరి చూపుల్లోనూ తన మనస్సులో కదిలే నిరసన భావమే అద్దం పట్టినట్లు కనిపించింది. కాని అది మాటల్లో కనబరచక "అయితే చెప్తాను విను మరి" అనగా అతడు చెప్పబోయే మాటలను చెవులొగ్గి వినసాగాడు చండకుడు.

"కొంచెం మంచినీళ్ళతో అభిషేకం చెయ్యి. శుభ్రంగా ఉన్న ఆసనం మీద కూర్చుని గంధం, అక్షతలు , అడవి పుష్పాలు, ధూప దీపాలు నీరాజనం అర్పిస్తూ నిశ్చల చిత్తంతో శివుని పూజించు. నీకు ఉపయోగించేది కాని, లేదా మరొక పదార్థం ఏదైనా నివేదన చెయ్యాలి. అన్నట్లు చెప్పటం మరిచాను, ముఖ్యంగా మహేశ్వరుడికి శ్మశాన భస్మాన్ని కానుకగా యిస్తే శంకరుడు వెంటనే సంతోషించగలడు". ఆ పూజా విధానమంతా వింటూ చండకుడు శ్రద్ధగా అదంతా మనస్సుకి పట్టించుకున్నాడు. వాడికి కొండెక్కినంత సంతోషమైంది.

వాడు గడపదాటిన వెనకే సింహకేతుని మిత్రులు విరగబడి నవ్వుతూ "మీరంత పూసగుచ్చినట్లు చెప్పినది వానికి ఒక ముక్కైనా బోధపడిందంటారా?" అన్నారు. "ప్రభువులు అడిగితే చెప్పలేదనే నింద నామీద అతడు వేయకుండా నా తప్పులేకుండా చెప్పానంతే. అదంతా వాడు చేయగలడనేనా?" అని నవ్వుతూ రాజకుమారుడు సమయానికి తగుమాటలు పలికి వారిని మెప్పించాడు.

-సశేషం

# గురు కృపాహి కేవలమ్

-రమణ ప్రసాద్

మా బాబాయి శ్రీవారణాసి ఆదినారాయణశాస్త్రిగారు శ్రీబాబు ఆంతరంగిక భక్తులలో ఒకరు. శ్రీబాబు ఆయనకు ఆంజనేయ స్వామి దర్శనం కలుగజేశారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు.

ఒకరోజు శ్రీబాబు వాకింగ్ చేస్తూ శాస్త్రిగారి రెండవ కుమారుణ్ణి చూపిస్తూ "వాడు అసలు బ్రతికి బట్టకట్టవలసినవాడు కాదు" అన్నారు. గుడివాడలో ఉండగా వాడికి చాలా జబ్బు చేసింది. పోలియోలాంటిది వచ్చి, కాళ్ళు, చేతులు, మెడ కండరాలు స్వాధీనం తప్పి మాట కూడ పోయింది. డాక్టర్లు అంతా తమ అశక్తతను వ్యక్తం చేశారు.

శాస్త్రిగారు శ్రీబాబు సహాయం అర్థించారు. శ్రీబాబు ఆయన మీద ఉన్న ప్రేమ కొద్దీ దానికి నివారోణపాయం తెలియ జేశారు. అయితే మీ విశ్వాసం ఏమాత్రం లోపించినా ఫలితం ఉండదు అన్నారు శ్రీబాబు. "శాస్త్రికి నా మీద భక్తి, విశ్వాసం ఉన్నాయి. ఆయన భార్య మాత్రం నన్ను ఏదో ఒక సందర్భంలో 'ఈయన పిల్లల్ని కని, పెంచితే కదా దానిలో ఉండే సాధక బాధలు తెలిసేది' అని విమర్శించింది అన్నారు శ్రీబాబు.

"కాని అటువంటి విమర్శలకు గాని, పొగడ్తలకు గాని చలించేవాడిని కాదు. నేను చేయదలచుకున్నదే చేసేవాడిని. అందుచేతనే వాడికి స్వస్థత చేకూరింది. వాడికి మాట కూడా వచ్చింది. శాస్త్రీ! ఏమంటావు?" అన్నారు. శాస్త్రిగారు 'తమరు చెప్పింది యదార్థమే' అని శాస్త్రిగారు సమాధానం చెప్పారు.

శ్రీబాబు శాస్త్రిగారి పుత్రుణ్ణి చూపిస్తూ "వీడిపేరు కన్నయ్య, కామిక్ యాక్టర్" అన్నారు. గురుదేవుడిపైన చెదరని విశ్వాసం ఉండాలి. ఎటువంటి సంకోచం ఉండరాదు. నిష్కళంకమైన మనస్సు మాత్రమే విశ్వాసాన్ని కలిగిస్తుంది.

ప్రతి దేవీనవరాత్రి ఉత్సవాలలో శ్రీ విజయేశ్వరానందగారు ఆశ్రమ బాలబాలికలచేత ప్రహ్లాదుడు, సత్యహరిశ్చంద్రుడు, సక్కుబాయి మొ॥గు నాటకాలు వేయించేవారు. ప్రతి నాటకంలో కన్నయ్య కామెడి పాత్రలు ధరించేవాడు. శ్రీబాబు చూసి ఎంతో ఆనందించేవారు.

శ్రీగురుదేవుల ఆశీస్సులు కన్నయ్యపై వర్షించటం చేత శ్రీమాతాజీ తమ యింట్లో ఉంచుకొని భోజన సదుపాయాలు తామే స్వయంగా ఏర్పాటు చేసి కన్నయ్యకు మహాన్యాసం, పూజా విధానం యిత్యాదులు నేర్పించారు. ఇటీవలే శ్రీగురుసాయుజ్యం పొందిన జి.యస్.యార్. మూర్తిగారి పర్యవేక్షణలో కన్నయ్య మహన్యాసం చక్కగా చెప్పటం అలవాటు చేసుకున్నాడు.

కాలగమనంలో ఆదినారాయణశాస్త్రిగారు వారి పత్ని కూడా గురుసాయుజ్యాన్ని పొందారు. కన్నయ్య ఆ దుఃఖాన్ని మరచిపోయేటట్లుగా మతాజీ వానిపై ప్రేమానురాగాలను చూపించారు.

మే2008లో పెదనింద్రకొలనులో సత్సంగ కార్యక్రమాలు చేస్తున్నారు. అక్కడకి కబురు వచ్చింది కన్నయ్యకు యాక్సిడెంట్ జరిగిందని. కన్నయ్య ఆశ్రమం ముందు బస్సు దిగి రోజు క్రాస్ చేస్తుంటే ఒక కారు వాడిని గుద్దటం, వాడు ఎగిరి క్రిందపడటం, తలకి బలంగా దెబ్బలు తగలటం జరిగింది. ఆశ్రమంలో భక్తులందరూ కన్నయ్యను ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. కని విని ఎరుగని విధంగా ఆ ఆస్పత్రి సర్జన్ అర్ధరాత్రివచ్చి కన్నయ్య తలకు ఆపరేషన్ చేశారు.

నింద్రకొలనులో ఆ వార్త విన్న మాతాజీ కన్నయ్యకు యే లోపం రాకుండా చూడమని ఆశ్రమంలో భక్తులకు ఆదేశించారు. చేయాల్సిన రక్షణ యాక్సిడెంట్ అవుతున్నప్పుడే వాడిని చేతులతో తీసి పడుకోపెట్టినట్లుగా చేశారు మాతాజీ. 'అంతా బాబు దయ!' అంటారు మాతాజీ. కన్నయ్యకు దెబ్బలు అన్ని మానిపోయాయి. వాడి జ్ఞాపకశక్తికి ఏలోటూ రాలేదు.

ఆశ్రమవాసం చేస్తున్న కన్నయ్య ప్రతిరోజూ శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో మహాన్యాసం చెబుతాడు, కుంకుమ పూజలు చేయిస్తాడు. స్వామికి అభిషేకం జరుగుతున్నంత సేపూ రుద్రం, శ్రీసూక్తం, పురుషసూక్తం, ఉపనిషత్తులూ చదువుతూనే ఉంటాడు.

**జాకో రాఖే సాయి యా మార్ సకేన కోయ్** అని హిందీలో సామెత ఉంది. భగవంతుడి రక్షణలో ఉన్నవాడికి ఎటువంటి హానీ కలగదు. సద్గురుదేవులు, మాతాజీ రూపంలో కన్నయ్యకు రక్షణ యిచ్చారు. అటువంటి సద్గురు కృపకు పాత్రుడైన కన్నయ్య ధన్యుడు!

▣

# నేను అర్థం చేసుకున్న ధ్యాన యోగం

- కొండ వెంకట్రాజు

ఆధ్యాత్మిక విద్యార్థి ముఖ్యంగా భగవద్గీతలో యీ క్రింద ఉదహరించిన 4 అధ్యాయములు ముందుగా అభ్యాసం చేయాలని సాధు పురుషులు చెబుతున్నారు. అవి ఏమిటంటే...

1) కర్మ యోగము (3వ అధ్యాయము)
2) భక్తి యోగము (12వ అధ్యాయము)
3) ఆత్మ సంయమ యోగము (6వ అధ్యాయము)
4) గుణత్రయ విభాగ యోగము (14వ అధ్యాయము)

మనం ఇప్పుడు ధ్యానయోగము గురించి చెప్పుకొందాము. మన ఆశ్రమ భక్తులు చాలమంది ఈ ధ్యాన యోగాన్ని ఆచరణలో పెడుతూనే ఉన్నారు. మనమందరమూ గృహస్థాశ్రమం నుండి వచ్చినవారమే. శ్రీబాబు గృహస్థాశ్రమాన్ని నిర్వహిస్తూ కూడ భగవంతుని సాన్నిధ్యం పొందవచ్చు అని చెబుతూ ఉండేవారు. ఆ విధంగానే భక్తియోగము, కర్మయోగములలోని విధులను మనకు ఎక్కువగా అలవాటు చేసి, ధ్యాన యోగాన్ని మాత్రం తగుమాత్రంగా అలవాటు చేశారు. ధ్యాన యోగాన్ని నూటికి నూరుపాళ్ళు సాధించటం గృహస్థులకు సాధ్యం కాదేమో అనిపిస్తుంది. శ్రీతారక పరబ్రహ్మ శాస్త్రిగారు మనకు పలుమార్లు చెప్పినట్లు ప్రతిరోజూ ఉదయం (బ్రహ్మ ముహూర్తంలో) ఒక గంట, రాత్రి ఒక గంట ధ్యానం అలవరచుకుంటే సరిపోతుంది. ఈ అధ్యాయములో, ధ్యానానికి ఎలా కర్చోవాలి? ఎలా చంచల మనస్సును అదుపులోకి తేగలగుగుతాము? ఎలా ఆత్మని పరమాత్మతో కలుపగలుగుతాము? అనే ముఖ్య విషయాలు భగవంతుడు అర్జునుడికి (ఆవిధంగా మనకి) విశదీకరించాడు.

ఎవడైతే కర్మఫలము ఆశించకుండా చేయదగిన కర్మలను చేయుచున్నాడో వాడే కర్మసన్యాసి లేదా యోగి అనబడుచున్నాడు, దేనిని సన్న్యాసమందురో దానినే యోగమని కూడ అర్థం చెపుకోవాలి. ఈ యోగసిద్ధిని పొందటానికి అతి ముఖ్యమైన సాధనం నిష్కామ కర్మ చేయుటం. ఫలితాన్ని ఆశించకూడదు. యీ విషయాన్నే భక్తియోగంలో మనస్సును నిలువరించటానికి పునాది అని చెప్పబడింది. ముందు మనం యీ పునాదిని గట్టిగా వేయాలి.

అప్పుడు ధ్యాన సాధన చక్కగా కుదురుతుంది.

శుద్ధమైన, స్వాధీనమై ఉండే మనస్సు మనకు బంధువు వలె మేలు చేస్తుంది. (మంచి మిత్రుడని అర్థం.) మలినమై, స్వాధీనం కాని మనస్సు శత్రువు వలె పీడిస్తుంటుంది. మనకి మిత్రుడు కావాలా? శత్రువు కావాలా? అన్నది మనమే తేల్చుకోవాలి.

భవసాగరం నుండి మనం బయట పడాలనుకుంటే మిత్రుడు లాంటి మనస్సుని పెంపొందించుకోవాలి. అప్పుడే మనకు ధ్యానం కుదురుతుంది. ముందు మనం మనస్సును నిలువరించటం అలవాటు చేసుకోవాలి. ఇంద్రియాలు జయించాలి. కోరికలను తగ్గించుకొని, చేయదగిన, శాస్త్ర సమ్మతమైన కర్మలు మాత్రమే చేస్తూ ఉండాలి. అప్పుడు ధ్యాన సాధన చక్కగా కుదురుతుంది.

సమస్త ప్రాణులందు సమభావం గలవాడై తనను సమస్త ప్రాణులయందున్న ఆత్మగాను, సమస్త ప్రాణులు తన ఆత్మయందు ఉన్నవిగాను చూడాలి. అలాగే సకల భూతముల యందు శ్రీహరిని చూడాలి. సకల ప్రాణులయందు గల హరి తనయందు కూడా ఉన్నాడని యెరిగి ప్రవర్తించాలి. "అట్టి భక్తుడికి నాకు భేదం లేదు. అట్టి భక్తుడికి నేను దర్శనం యిస్తాను. అట్లే ఆ భక్తుడు నాకు కనబడకపోడు" అన్నాడు భగవద్గీతలో శ్రీకృష్ణ భగవానుడు. సుఖం తమకేవిధంగా అనుకూలమో అలాగే మిగతా ప్రాణికోట్లకు కూడా సుఖం లభించాలి అని ప్రాణులు కోరుకుంటాయి అని తెలిసి ప్రవర్తించాలి. ఈ విధంగా ఆత్మకి, పరమాత్మకి తేడా లేదని తెలుసుకుంటాము. ఇవి అన్నీ ధ్యాన సాధనకి చాలా అవసరం. ఆత్మ, పరమాత్మ ఒక వస్తువే అని తెలుసుకోవటమే ధ్యానం యొక్క పరాకాష్ఠ.

అర్జునుడు అడుగుతున్నాడు 'మనస్సు చాలా చంచలమైనది కదా? అట్టి మనస్సును నిగ్రహించటం వాయువుని గుప్పెట్లో బంధించటంమంత కష్టం కదా? అట్టి కష్టమైన పనిని నేను ఎలా చేయగలను?' అని ప్రభువు చెబుతున్నాడు "అర్జునా! నీవన్నట్లు మనస్సును నిగ్రహించటం అంత కష్టమైన పనే. అయితే ఎడతెరిపి లేకుండా అభ్యాసం చేస్తూ ఉంటే, మనస్సుకి వైరాగ్యం అలవరస్తూ ఉంటే ధ్యానం నెమ్మది నెమ్మదిగా కుదురుతుంది" అని.

-సశేషం

# శ్రీకృష్ణ కర్ణామృతం

(గతసంచిక తరువాయి) -సుశీలా ప్రసాద

బాటమీదకి వచ్చానని గౌరన్న గ్రహించేసరికి వెంటనే పెద్ద చప్పుడుతో ఏదో విరిగి పడింది. తనకి చేయూతనిస్తున్నది కన్నయ్యేనని తెలుసుకున్న గౌరన్న "కన్నా! ఏమిటిదంతా?" అన్నాడు. "పెద్ద ప్రళయమువంటి వాన వస్తోంది. నువ్వున్న పాక కూలిపోయింది. నా చేతిని వదలక నడు" అన్నాడు కన్నయ్య. కొద్ది దూరం నడిచేసరికి తమ మీద వాన పడకపోవటంతో "కన్నా! వాన ఆగిందా?" అన్నాడు. "లేదు గౌరీ! నువ్వూ, నేనూ తడవకుండా ఈ కొద్దిమేరకు నేనే వానపడకుండా ఆపాను. మిగతా చోటంతా మిన్ను విరిగి మీదపడేటట్లు కురుస్తోంది రాళ్ళ వాన" అన్నాడు.ఆశ్చర్యంతో అవాక్కు అయ్యాడు గౌరన్న అది వింటూ. తను వడిగా కన్నయ్య చెయ్యి పట్టుకుని నడుస్తుంటే అప్పుడు గుర్తించాడు అతడు తన కుంటికాలు సరిగానే పనిచేస్తోందని. ఈ అద్భుతాలన్నీ చేస్తున్నవాడు మాములు మనిషి ఎలా అవుతాడు?

గౌరన్న మెదడు విచ్చుకుంటోంది. అంతవరకూ తనెరగని జ్ఞానమేదో అందులో నిండుకుంటోంది. దేహమంతా ఆనందం నిండిన పూర్ణపాత్ర అవుతోంది. ఆ స్థితిలో ఉన్న గౌరన్నను "నువ్వు ఇక్కడే ఉండు! నీ కోసం వాన ఆపినా, మిగిలిన అందరికోసం వాన నుంచి తప్పించేందుకు యీ కొండనెత్తున్నాను" కన్నయ్య మాటలు వింటుండగానే రండి రండి అని పిలిచేవాని కేకలకు జనం వచ్చిన కలకలం వినవచ్చింది. తనకి అన్ని వేపులా చుట్టుకున్న జీవుల కదలికలు, సంతోష ధ్వానాలు, జయ జయ నినాదాలు వింటూ గౌరన్న మనస్సు ఆపుకోలేక పోయాడు. "కన్నా! సకలజీవరక్షకుడవైన నీ దివ్య మంగళ రూపాన్ని ఒకసారి చూడనీ!" అని గొంతెత్తి ప్రార్థించాడు. చీకటి ముసిరిన కళ్ళ వెంట నీళ్ళ ధారలు వరదలవుతున్నాయి. అతని ప్రార్థన వృధా కాలేదు.

"గౌరీ! చూడు!" అంటున్న కన్నయ్య గొంతు వింటూ కనురెప్పలు కదిలాయి. కళ్ళల్లో కాంతి రేఖలు నిండాయి. గొప్ప తేజస్సు మూర్తీ భవించినట్లు ఉన్న కన్నయ్య కనిపించాడు. తన వంక చూసే అరవిందాల వంటి అరుణిమతో మెరిసే విశాలమైన కళ్ళు దయాపూర్ణములై ఉన్నాయి. సర్వేశ్వరుడు,

సర్వాంతర్యామి అయిన వాని అమృత రూపాన్ని నిలువెల్లా చూశాడు గౌరన్న. తామరపువ్వు లాంటి చేతి చిటికెన వ్రేలిపై గొప్పదైన కొండ, సుందరమైన పువ్వులా అలవోకగా నిలిచి ఉంది అద్భుతమైన ఆ దృశ్యాన్ని చూసిన గౌరన్న బ్రహ్మానంద జలధిలో తేలియాడుతూ "చాలు ప్రభూ! నీ యీ దివ్యరూపాన్ని చూసిన యీ కళ్ళతో ఇక మరి లోకాన్ని చూడలేను. నా చూపు తీసేసుకుని నన్ను నీవైపుగా నడిపించి నీలో చేర్చుకో!" అన్నాడు. గిరిధరునికి ప్రణమిల్లుతూ.

కొంచెమెర్రనివై, దయగలవై, వెడల్పు గలిగి దీర్ఘములైన కన్నులు కలది లక్ష్మీ స్వరూపమును దర్శించినప్పుడు కలిగిన శరీరమందలి రోమాంచము గలది, వేణునాదముతో చపలముగా చేయబడిన ముని మనములనెడి కమలములు గలది కమ్మని మోవిగల అమృతమైన శ్రీకృష్ణునిరూపము నా చిత్తము నందు క్రీడించుచున్నది.

-సశేషం

## ఏకం సత్ విప్రాః బహుధా వదంతి

పసికూనలై అజ్ఞానమనే నిస్సహాయ స్థితిలో ఉన్నప్పుడు జ్ఞానమనే క్షీరాలతో పెంచి, ధీరుల్ని చేసే అమ్మ రూపమే ఆ గురుశక్తి. నిత్యానిత్య వస్తువివేక బోధచేసి, గురుపాదానికి దారి చూపిన నాన్న రూపమే ఆ గురుశక్తి. పొట్టకూటి విద్యలు నేర్పే ఉపాధ్యాయ రూపమే ఆ గురుశక్తి. గురుసాయుజ్యమనే జఠరాగ్నిని రగిలించి, శమాది షట్కసంపత్తి అనే ఔషధాన్ని, బోధామృతమనే తేనెతో కలిపి అవలీలగా త్రాగిస్తున్న సరస్వతీ రూపమే ఆ గురుశక్తి.

'నగురోరధికం నగురోరధికం' అనే మహామంత్ర పథ్యాన్ని చేయించే శివశక్తియే ఆ గురుశక్తి. సుఖదుఃఖాలకతీతమైన బ్రహ్మానంద స్థావరమైన, కైవల్యమనే ఒడిలోకి చేర్చుకుంటున్న కూటస్థ పరబ్రహ్మ చైతన్యమే ఆ గురుశక్తి. బ్రహ్మరాతనైనా తిరగరాయగల నిర్హేతుక జాయమాన కరుణా సముద్రుడు పరబ్రహ్మమే ఆ గురుశక్తి.

కడుపాప పుణ్యాలను, కడు పాపకర్మలను సరితూచగల దయా స్వరూపమే ఆ గురుశక్తి. అండ, పిండ, బ్రహ్మాండాలతో ఆడుకుంటూ తానే వాటికి ఆధారమై గురువులకే గురువైన జగద్గురు రూపమే ఆ గురుశక్తి.

- పి. శివాని

# పరిప్రశ్నేన సేవయా

-పరాశర ప్రసాద్

'మహాత్ములు ధనవంతులని, పేదవారని, పూర్వాశ్రమంలో వారి ప్రవర్తన ఎటువంటిదైనా సమభావంతో ఆదరించటంలో ఆంతర్యమేమిటి?' అని సందేహాన్ని లేవదీసిన భక్తునికి సమాధానమిస్తూ..................

శ్రీసద్గురుదేవులు "ఎవరైనా వ్యాధిగ్రస్థుడే డాక్టరు వద్దకు వస్తాడుగాని, ఆరోగ్యవంతుడు ఎందుకు వస్తాడు? ఆకలిగొన్న వాడే తినగలుగుతాడు గాని, కడుపు నిండినవాడికి ఎంత యిష్టమైన పదార్థాన్ని అందించినా తినగలుగుతాడా? దీనిని అర్థం చేసుకోండి. డాక్టరుగారు రోగికి వైద్యం చేస్తాడు గాని, ఆరోగ్యవంతుడికి వైద్యంగాని, చికిత్సగాని చేయడు కదా! అంతేకాదు సాటిమనిషిలో మంచిని గుర్తించి, చెడుని విస్మరించటం ప్రతి సాధకుడూ గ్రహించగలగాలి. మహాత్ములకి, జీవులకి మధ్య గల సంబంధం అనేక జన్మల నుంచి వచ్చిన లింకు. ఆ సబ్జక్టు తెలుసుకోవటం కష్టం.

ఇక్కడ మీకొక దృష్టాంతం చెబుతాను. షిరిడి సాయిబాబా ధనవంతుడు, బీదవాడు అనే తారతమ్యం లేకుండా అందరి వద్దకు వెళ్ళి యాచన చేసేవాడు. ఏది ఇస్తే దానిని స్వీకరించేవారు దానిని చూసి శ్రీసాయిబాబా దగ్గర ఉన్న కొంతమంది శిష్యులు 'బాబా! మీరలా అందరి దగ్గరకూ వెళ్ళి యాచించట మెందుకు? మీకు అవసరమైన పప్పులూ, ధాన్యాలూ మేమంతా సేకరించి మీకు అందజేస్తాము' అన్నారు. శ్రీసాయిబాబా దానికి సమాధానం చెబుతూ ' పిచ్చి వాళ్లలారా! నా మీద మీరు చూపిన ప్రేమకు ధన్యవాదాలు. అల్లా మాలిక్ మీకు మేలుచేయుగాక! నాకు మీరు ధనధాన్యాలు యివ్వగలుగుతారు కాని నేను అందరి దగ్గర యాచించి స్వీకరించిన కర్మను రహితం చేయగలుగుతారా? అలా చేస్తే మీరు చెప్పిన దానికి నేను సమ్మతిస్తాన'న్నారు.

చూశారా! మహాత్ముల దృష్టి ఎలా ఉంటుందో. వారి ప్రేమని అంచనా వేయ గలుగుతారా!" అన్నారు శ్రీగురుదేవులు. మహాత్ములు చేసే ప్రతి పని వెనుక ఎంతో గోప్యమైన ఆంతర్యం ఉంటుంది. దానిని సామాన్య మానవులు అర్థం చేసుకోగలుతారా! పోనీ అటువంటి రహస్యమైన విషయాన్ని తెలియజేసినా నమ్ముతారా! అలా అర్థం చేసుకుంటే కురుక్షేత్ర సంగ్రామం సంభవించేదా! బుద్ధి కర్మానుసారిణి అన్నట్లుగా ఎంత వివేకవంతుడైన మానవుడైనా కర్మబద్ధుడే. కాని సద్గురుమూర్తిని పరిపూర్ణ విశ్వాసంతో ఆశ్రయించిన వాడు మాత్రం కర్మని రహితం చేసుకోగల్గుతాడు. ఇది మాత్రం సత్యం" అన్నారు శ్రీబాబు.

■

# కుంకుమ అక్షతల మహిమ

- ఎ. జయభారతి

దసరా మహోత్సవాలలోని కుంకుమ, అక్షతలకి ఉన్న శక్తి చాల అమోఘమైనది. 1988లో మా యింట్లో జరిగిన సంఘటన.................

1988 అక్టోబర్ మాసంలో మా కోడలికి శ్రీమంతం చేయడానికి మేము బాపట్ల నుండి తాడేపల్లి (కృష్ణకెనాల్) వెళ్ళాము. ఆరోజు రాత్రికి శ్రీమంతం వేడుక జరిగింది. అదే రోజు బాపట్లలో మా యింట్లో దొంగలు పడ్డారు. తెల్లవారుజామున మా ప్రక్కయింటివారు 'వేసిన తాళం తీసి ఉన్నదేమిటా!' అని ఇంట్లోకి వెళ్ళి చూడటంతో ఇల్లంతా భీభిత్సంగా ఉన్నది. దొంగలు పడ్డారు అని గ్రహించి, విషయాన్ని ఫోన్ ద్వారా మాకు తెలియజేశారు.

మేము వెంటనే బయలుదేరి యింటికి వచ్చి చూసుకునేసరికి చెక్క బీరువాలో ఉన్న గుడ్డలు చెల్లాచెదురుగా యిల్లంతా పడవేశారు. అలాగే వాళ్ళకు తెలియకుండానే చెక్కబీరువాలో ఉన్న అక్షింతలు, కుంకుమ పొట్లాలను తీసి ఇనపపెట్టె మీద పెట్టారు.

ఇనపపెట్టె హ్యాండిల్స్ తీయటానికి, గడ్డపలుగు, కత్తి, స్క్రూడ్రైవరు, రోకలి మొదలగు వస్తువులను ఉపయోగించి ఎంత ప్రయత్నించినా పెట్టె తలపు రాలేదు. వంటగదిలో ఉన్న పప్పులు, పిండ్లు అన్నిటినీ పారపోశారు.

ఇనపపెట్టె చూసేసరికి పెట్టె తెరవడానికి ఉపయోగించిన కత్తి విరిగిపోయింది. స్క్రూడ్రైవర్ వంకర పోయింది. రోకలి సగానికి విరిగింది. కాని ఇనపపెట్టె తలుపు హ్యాండిల్స్ తెరుచుకోలేదు. ఎందుకు తెరుచుకోలేదో అని చూడగా ఆశ్చర్యపోయాము. అప్పుడు మా కంటికి ఇనపపెట్టె మీద ఉన్న కుంకుమ, అక్షతలు చూడగా మాకు అసలు విషయం అర్థమైనది. ఇనపపెట్టెలో ఉన్న వస్తువులు పోకుండా మమల్ని కాపాడినవి ఆ కుంకుమ, అక్షతలే! అని మా ప్రగాఢ విశ్వాసం.

శ్రీబాబు చెప్పినట్లు దసరాపూజలకి ప్రసాదంగా యిచ్చే కుంకుమ, అక్షతలు సదా మన వెంట ఉండి రక్షిస్తాయి! ఇది సత్యవాక్కు! బాబువాక్కు!

■

# హనుమంతునికి అమనస్క ఉపదేశము

(గతసంచిక తరువాయి)

- ఈవూరి రోశిరెడ్డి

ఈ ప్రసంగం వింటున్న హనుమ కన్నుల నిండా ఆ సమయంలో కన్నీరు నిండింది. అదే సమయంలో ఆయనకి గుర్తుకు వచ్చింది - ఆనాడు లంకాపురిలో శ్రీరాముడు ,సీతామాత స్వీకారానికి నిరాకరించగానే ఆమె అగ్ని ప్రవేశం ద్వారా తన పవిత్రతను నిరూపించుకోగలిగినది - అప్పుడే అగ్ని దేవుని సూచన మేరకు శ్రీరాముడు సీతామాతను స్వీకరించాడు. ఆ కారణంగానే యీనాడు ఇక్కడ వెలుగొందుచున్నాడు.

"పావనీ!" అని సంబోధిస్తూ, శ్రీరామచంద్రుడు ప్రబోధం సాగించాడు. "ఈ మాత అనుగ్రహం లేనిదే జీవుడు జనన మరణ గమనం దాటే మార్గం చేరలేడు" రెండూ - జ్ఞానమూ, వైరాగ్యమూ ఈమె సంతానమే. యీమె కరుణయే! పరమ ప్రేమ రూపిణియైన, యీమె అంతఃకరణంలో ప్రవేశించనిదే ఏ ప్రాణీ నిర్మల తత్త్వం పొందజాలదు.

ఈ కనబడే లోకమంతా త్రిగుణాత్మక ప్రకృతి పరమైన వేడుకయే! ఇందలి గుణములోనే ఉన్న గుణములే యీ రకంగా వ్యవహరించడ మవుతుంది. రూపమాత్రకమైన కన్నులు రూపము వరకే చూడగలవు. గంధ తన్మాత్రకే అంకితమైన ముక్కుకు గంధమే (వాసనయే) గోచరమవుతుంది. ఈ విధంగా ప్రతి గుణమూ, వృత్తీ తన పరిమితి వరకే ఉంటూ ఉంది." ఇదే విషయాన్ని వివరిస్తూ శ్రీరాఘవేంద్ర అన్నారు -"అంతఃకరణ యీ గుణముపట్ల ఆసక్తమయి ఉన్నంత వరకు జనన మరణ చక్రము సాగుతూనే ఉంటుంది. కారణమేమనగా గుణముల వాసనల మూలంగానే. శరీరం సృష్టించ బడుతోంది. కలలోని లోకాలూ, ప్రపంచమూ, సంస్కారములకు అనుగుణంగా రూపొందుతున్నట్లుగా ఒక శరీరం సమాప్తికాగానే మరొక శరీరాన్ని కూడ సృష్టించుకొనగలవు. - ఈ వాసనలు, ప్రకృతి త్రిగుణమయమయినది. కాబట్టి యీ ప్రాకృత ప్రపంచమంతా దాని లీలావిలాసమంతా, మూడు గుణాల మేళవింపే!

ప్రకృతి పరమైన యీ లీలా విలాసం, నిత్యమూ, అనాదిగా అనంతంగా సాగుతూ పురుషుణ్ణి తన వైపు ఆకట్టుకొనుచున్నది. ఇందులో

గుణదోషములు లేనే లేవు. కేవలం బుద్ధి భేదం వలననే యిందులో విడి విడిగా కనిపిస్తాయి. ప్రకృతిపరమైన యీ భిన్నత్వంగల యీ కర్మ ప్రవాహం సనాతనంగా సాగుతూనే ఉంది. పురుషుడు యిందులో తన కర్తృత్వ అహంకారాన్ని ఆపాదించుకుని బందీ అయిపోతున్నాడు. తాను కర్తనని భావించినంత కాలం అతడు భోక్తగా ఉండాల్సివస్తుంది. లేనట్లయితే అతడు సహజంగా బద్ధుడు కాదు.

ఈ జగన్మాత వాత్సల్యమయమైన ఒడిలోనే యీమె పుత్రులంతా నిద్రిస్తున్నారు. వారు నిద్రలోనే కలలు కంటున్నారు. వారి సుఖదుఃఖాలన్నీ కలల మయమే! వారు ఆనందరూపులే! అనంతుడైన భగవానుని అంశ అయిఉండి కూడ వీరు మోహ నిద్రలో మునిగి దుస్వప్నాలు చూస్తున్నారు. దయామూర్తి అయిన యీమె వారిని మేల్కొలపాలని ప్రయత్నిస్తుండగా వారికిది బాధాకరంగా అనిపించింది. అయినా అందరినీ మేల్కొపడానికి తగిన స్థితి కల్పించారు. స్వతః ప్రతి హృదయంలోనూ, యీమె ప్రేమ రూపంగా వెలుగొంది ఉంది. కాని యీమె విశుద్ధ తత్త్వాన్ని గుర్తించజాలక, జీవులు. పదార్థాలలో విషయాలలో యిరుక్కొని పోయి ఎంతో దీనంగా దుఃఖానికి లోనయిపోతున్నారు.

ప్రపంచమందలి యీ సమస్త విస్తారమయిన స్వరూపమంతా యీ మహాకాళీ రూపమే! ఇక్కడ - యీమె కాల స్వరూపిణియై క్రీడిస్తూ ఉంది. ఈ కాల స్వరూప భోగానుభవము, కాలాతీతుడైన పురుషుడు మాత్రమే మహాకాలుడుగా పొందగలడు. ఈ ప్రక్రియలో కోరికతో ఉన్నవాడెక్కడైనా కాలగతికిలోను గావలసి వస్తుంది. ఇక అట్టివాడు జన్మ నుండి జన్మకూ పరిభ్రమిస్తూనే ఉంటాడు.

వాస్తవానికి యీమె అమృత స్వరూపిణియే! కాని యీ రూపం అంతర్ముఖమై అంతర్యామితో ఏకమైఉంది. హృషీకేశుని వైపుకు సాగిపోయే ప్రాణి, యీమె ద్వారా అమృతత్త్వాన్ని పొందుతాడు. ఈమె అంతర్ముఖమైనవాని అన్ని భారాలు రక్షణ, పోషణ సంవర్ధన మొదలైనవన్నీ యీమె వహిస్తుంది. ఈ ప్రేమరూపిణి, ఆశ్రయం పొందినవారు అంతటా, భయం లేకుండా భద్రత కలిగి ఉంటారు.

-సశేషం

# బాబూజీ రాజయోగి

(గత సంచిక తరువాయి) - రామస్వామి సంపత్

శ్రీగురుదేవుని పట్ల అచంచలమైన విశ్వాసం ఉండాలని బాబూజీ అంటూ ఉండేవారు. మానవాకారంలో కనిపించే సద్గురువుని మానవమాత్రునిగా భావించరాదని బోధించేవారు. గురువంటే గుణ రూప రహితునిగానే భావించాలనీ, కేవల నిర్గుణ పరబ్రహ్మ స్వరూపంగా గ్రహించాలనీ, గురువు అంటే బ్రాకెట్‌లో పరమాత్ముడని వ్రాసుకోమనీ, మానవుడికి కలిగే భౌతిక, ఆధ్యాత్మిక సమస్యలన్నిటినీ పరిష్కరించగలవారే సమర్థసద్గురువులనీ బాబూజీ ముమ్మాటికీ వక్కాణించేవారు.

శ్రీకాళీగార్డెన్స్‌లో ప్రతి నిత్యం జరిగే ప్రార్థన ఏ ఒక్క మతానికి, ఏ ఒక్క సాధన మార్గానికి పరిమితమైనది కాదు. అది సార్వజనీనము, సార్వకాలికము, సర్వమత సమ్మతము. మానవుల మధ్య భేదబుద్ధిని తొలగించి, ప్రేమదృష్టిని, సమభావాన్ని పెంపొందించమనీ, అందరిలో మంచినే చూడటానికి, మంచినే గ్రహించటానికి, అందరికీ మంచినే చేయుటానికీ శక్తియుక్తులను అనుగ్రహించమని జగత్పిత అయిన పరమేశ్వరుని గురించి చేసే ప్రార్థన అది.

శ్రీసద్గురు చరణారవిందాలయందు అచంచల భక్తి విశ్వాసాల నుంచి ప్రార్థించ గలిగితే అంతఃకరణ చతుష్టయమైన మనస్సు, చిత్తము, బుద్ధి, అహంకారం వరుసగా సత్యం, శాంతి, దయ, ప్రేమగా మారిపోగలవు. మానవునిలోని 'నా'కారం అంటే నానాత్వం హరించిన 'న'కారం 'ధ'కారంగా మారిపోతుంది. బుద్ధి 'ధీ' లేక బుద్ధి సమాధి స్థితిని పొందుతుంది. అప్పుడు మానవుడు మాధవుడౌతాడు. ఇదీ బాబూజీ బోధనల సంగ్రహం.

ఇటీవల కొంతకాలంగా బాబూజీ సద్గురువులోని నిర్గుణ తత్త్వాన్ని బోధిస్తూ వచ్చారు. గురుదేవుని అభయహస్తం దృశ్యంగానూ, అదృశ్యంగానూ కూడా ఇహంలో సకల ఐశ్వర్య భోగభాగ్యాలను, పరంలో నిరతిశయమైన పరమపదాన్ని ప్రసాదించగలదని, అ అభయహస్తంలో జీవించగల మానవుడు ధన్యుడని తరచు బాబూజీ స్పష్టం చేస్తూ ఉండేవారు. ఆ అభయహస్తంతో భక్తులను ఆశీర్వదిస్తూ 'భయమెందుకు? నేను ఇక్కడ ఉండగా!' అని శ్రీబాబు ఉద్ఘాటిస్తూ ఉండేవారు. ఈ ప్రపంచానికి అంత ధైర్యం చెప్పే మహామనీషులే కదా నేడు కావలసింది!

▪

# భగవత్సాక్షాత్కారము

(గతసంచిక తరువాయి) - రమణ ప్రసాద్

భగవంతుని తప్ప నీ మనస్సు దేనినీ తలవదన్న భావనను మనస్సులో గట్టిగా నిలుపుకో. మనస్సు గడియారాన్ని గురించిన తలపును తీసుకు వస్తే దానిని భగవంతునిగా భావించు. ఒక కుండ తలపుకు వస్తే ఆది భగవంతునిగా భావించు. నీ మనస్సు దేని గురించీ ఆలోచించకపోతే భగవంతుని ఏ తలపూ లేని స్థితిగా భావించు. మనస్సు భార్యా పుత్రాదుల గూర్చిగాని, సంపద గూర్చి గాని ఆలోచిస్తే వాటిని భగవంతునిగా చూడు. ఒక చెట్టునిగాని, రాయినిగాని తలపుకు వస్తే వాటిని భగవంతునిగా చూడు. నీకు యేవిధంగా కనిపిస్తాడో భగవంతుని ఆ రూపంగానే చూడు. తరించటానికి యిది ఒక సూటి అయిన మార్గము.

పైన చెప్పిన మార్గములు తరించటానికి సహాయపడతాయి. అయితే ఒక మార్గము ఇంకొక మార్గము కంటె ఎక్కువ కాలము సాధించటానికి పట్టవచ్చు. కాని అన్ని మార్గములు దైవత్వానికి దారి తీస్తాయి.

కలలో కనిపించిన ప్రపంచము మెలకువ రాగానే నశిస్తుంది. నీవు ఒక స్వప్నావస్థలో ఉన్నట్లు భావించు. ఇంద్రియముల ద్వారా ఏది తెలియబడినా అది స్వప్నంలో సృష్టించబడినదానిలాగ భావించు. కల నుండి మేల్కొంచిన వెంటనే సత్యవస్తువు నీకు గోచరమవుతుంది.. ఈ కనిపించేది మిధ్యగా, స్వప్నంలో సృష్టించబడిన ప్రపంచంగా భావించు. కలలో దేనిని చూస్తున్నావో నిజంగా దానికి ఉనికి లేదు. కనులు తెరవగానే అది నశిస్తుంది. కల అంతము కావల్సినదే. కనులు తెరవగానే కల అంతమవుతుంది. ఈ రోజుదాకా కనులు ఎందుకు తెరవలేదు అనే ప్రశ్న వస్తుంది? దానికి సమాధానము యీ నాటి దాకా నీవు యీ ప్రపంచాన్ని కలగా భావించలేదు. ఆత్మ మార్పులేనిది. కావున మనస్సులో యీ ప్రపంచమే స్వప్నంగా భావించు. అది నిజంగా కనిపించినా దానిని నీవు స్వప్నంగానే విశ్వసించు. అది నీకు ఎలా కనిపించినా దానిని కలగానే గుర్తించు. అలా విశ్వసించిన కొలదీ కల అంతమై సత్యవస్తువు గోచరమవుతుంది.

ఈ సత్యాన్ని నీవు ఎల్లప్పుడూ జ్ఞప్తిలో ఉంచుకొనలేకపోతే నీకు ఏది ఎక్కువ తలపుకు వస్తుందో ఆలోచించు. అది భార్యా, పుత్రులు, లేక ధనము లేక యితర ప్రీతికరమైన వస్తువులా? వాటిలో నీవు ఎక్కువగా ప్రేమించేది

ఏదో తెలుసుకో. ప్రాణం (శ్వాస) అన్నిటికంటె ప్రేమించదగ్గది. ఏలనన జీవించి ఉండటం కన్న ప్రియమైనది ఏది ఉంటుంది? అలా అయితే ప్రాణాన్ని బ్రహ్మగా నమ్ము. నీకు ఏతి ప్రీతికరమో దానిని నీవు తప్పక గుర్తించ గలుగుతావు. ఐదు రకముల ప్రాణవాయువులను బ్రహ్మ (భగవంతుని) గా గుర్తించు. శ్వాస ద్వారా వచ్చే శబ్దమును బ్రహ్మగా గుర్తించు. ఉచ్ఛ్వాస నిశ్వాసలను గమనించు. ఈ సాధన చేయుట వల్ల తప్పక ముక్తి లభిస్తుంది. ఇవి చివరి వరకు ఉంటాయి. నీకు తప్పక పరమ పదం లభిస్తుంది. ప్రాణశక్తిని బ్రహ్మగా గుర్తించు. ఉచ్ఛ్వాస నిశ్వాసములు 'సో ऽహం' అంటే అది (భగవంతుడు) నేను. అది కూడా పరమాత్మ నామమే. దీని ద్వారా పరమాత్మను తెలుసుకోవచ్చు. ఏ సాధన వీలుగా ఉంటుందో దానిని అభ్యాసం చెయ్యి.

అన్ని తేజస్సులకంటె భగవానుని తేజస్సు అత్యంత కాంతివంత మైనది. మనకు కనిపించేవాటిలో సూర్యుని కాంతి ఎంతో తేజోవంతమైనది. సూర్యుడు ఎల్లప్పుడూ ఉండడు కదా. అలా అయితే ఆకాశం ఎప్పుడూ కనిపిస్తుంది. దానిని భగవంతునిగా భావించు. ఆత్మస్వరూపుడు చైతన్య స్వరూపుడు. ఆకాశము వలె సర్వాంతర్యామి. అతని వలననే జ్ఞానం ప్రకాశిస్తోంది. ఈ అభ్యాసం నిన్ను తరింపజేస్తుంది. దీనిని చేయలేకపోతే ఆకాశాన్ని భగవానునిగా భావించు. మిగిలిన దానిని భగవానుడే చూసుకుంటాడు. ఆ భావాన్ని భగవానుడే నీకు స్ఫురణకు తెస్తాడు. భగవంతుడు ఆకాశం ద్వారా ప్రకాశిస్తే ఆకాశం చైతన్యవంతమై ప్రకాశిస్తుంది. భగవంతుడిని రూప రహితునిగా ధ్యానించు.

పైన చెప్పిన సాధనా మార్గములు కాక యింకనూ అనేక మార్గములు కలవు. కాని అభ్యాసం ముఖ్యము. భగవానుని ఏదో ఒక మార్గమును అనుసరించనిదే తెలిసికొనలేవు. ఈ మార్గములు గీతలో, వేదములలో, ఉపనిషత్తులలో తెలుపబడినవి. ప్రతి సాధనామార్గమునకు శాస్త్ర ప్రమాణములు కలవు. సాధకులు వారికి నచ్చిన సాధనా మార్గములనెన్నుకోవాలి. ఫలాపేక్షతో సాధన చేస్తే వ్యక్తిగతంగా ఐహిక సుఖాలను పొందవచ్చు. అట్టి సాధన భగవత్ప్రాప్తికి దారి తీయదు. కాని నిజమైన ఆనందాన్ని పొందాలంటే ప్రాపంచిక విషయాలను కోరకు. భగవద్రూపాన్ని ధ్యానించి, ఆ తీయని దివ్య నామాన్ని నోటితో ఎల్లప్పుడూ ఉచ్ఛరించు. అంతటా ఆనందాన్ని దర్శించు. ఈ సాధనలు అత్యంత శ్రేష్ఠమైనవి, సులభమైనవి.

▣

## శ్రీకృష్ణాష్టమి వేడుకలలో శ్రీమాతాజీ అనుగ్రహభాషణ

గురుదేవులు బృందావనంలోనే ఉన్నారా? వారు సర్వవ్యాపకులు. కాని మనకి ఒకే చోట చూడటం అలవాటైంది. భగవంతుడు సర్వత్రా ఉన్నాడు అని గుర్తింపజేశారు మన గురుదేవులు. దానిని గుర్తించు. దానికి మార్పు లేదు. నువ్వు మేనుని నేనుగా చూడటమే మార్పు. కాని ఎన్ని క్రియలు చేస్తున్నా నాలోని నేను మార్పు చెందదు అని గుర్తించాలి.

రేపల్లెలో ప్రతి హృదయం తల్లిగా మారింది. ఆ బుజ్జి బాలుణ్ణి ఎత్తుకోవాలి. రేపల్లెలో అందరికీ అందుబాటులోకి వచ్చాడు. పూతనకు కూడా చిక్కాడు. తన క్షీరాలను విషం చేసి యిచ్చిన పూతనకు సద్గతిని ప్రసాదించాడు కృష్ణుడు. ఆ క్షీరాలను గ్రోలి పూతన ప్రాణాలను హరించాడు. ఆ రాక్షసి పెద్ద ఆకారంతో కొన్ని యోజనాల విస్తీర్ణంలో పడిపోయింది. దాని దేహాన్ని ఖండఖండాలుగా చేసి దహన సంస్కారం చేస్తే దివ్య పరిమళం అంతటా వ్యాపించింది. అది ఎలా సంభవించిందంటే ఆ రాక్షసికి కృష్ణ స్పర్శ కలగటం చేత. భగవంతుని పాదాలు గట్టిగా పట్టుకున్న మనకు భయం ఎందుకు కలుగుతుంది?

గురుదేవులను ఒకరు అడిగారు 'భగవంతుడు ఎలా ఉంటాడు?' అని. గురుదేవులు అతని తలలో జుట్టు పట్టుకుని గట్టిగా లాగారు. 'అబ్బా! నొప్పి' అన్నాడు. అతని కాలును గట్టిగా గిల్లారు. బాధతో విలవిలలాడాడు. అది ఎలా తెలిసింది? అని అడిగారు. నీ మనస్సు నఖశిఖ పర్యంతం సర్వవ్యాపకమై ఉన్నది కాబట్టి అని చెప్పి, అదే విధంగా భగవానుడు సర్వవ్యాపకుడు అని తెలియజేసారు.

**సహస్ర శీర్ష్వా పురుషః సహస్రాక్ష సహస్రస్పాత్।** అంతటా ఆయనే. అన్ని చేతులూ వాడివే. అన్నిటికి ఆధారం ఆ ప్రభువే. ఆయనను 'నా హృదయేశ్వరా!' అని మనసారా తలిస్తే చాలు తరించటానికి. మనో బుద్ధి చిత్త అహంకారాలు సత్యం, శాంతి, దయ, ప్రేమగా మారితే నీ అంతఃకరణ పవిత్రమై అక్కడ నీ హృదయబాబు దర్శనమిస్తాడు' అని చెప్పారు శ్రీగురుదేవులు. భగవానుడు కూడా భగవద్గీతలో అదే బోధించాడు. **ఈశ్వరస్సర్వ భూతానాం హృద్దేశేర్జున తిష్ఠతి ।**

భగవంతుడు ఒక్క రాక్షస సంహారం చేయటమే కాదు. అర్ధరాత్రి నిన్ను పలుకరిస్తున్నాడు. నువ్వెవరు? అని ప్రశ్నించుకుని విచారణ చెయ్యి. ఉల్లిపాయ పొరలు అన్నీ తీస్తే పొరలు తీసే వాడే మిగులుతాడు.

శ్రీగురుదేవులు చెప్పేవారు శ్రీకృష్ణుడు వేణుగానం చేస్తే గోపికలందరూ ఏ పనిని చేస్తున్నా వదలి స్వామి వద్దకు వెళ్ళేవారు. మజ్జిగ చిలుకుతున్న చేతులతో కొందరు వెళ్తే, స్నానం చేస్తూ వెళ్ళేవారు కొందరు. మెడకు పెట్టుకొనే నెక్లెస్ తలకు పెట్టుకొనేవారు. ఎందుకంటే అక్కడ మనస్సు లేదు.

మనని గురుదేవులు అనుగ్రహించారు. ఆశ్రయం యిచ్చారు. పాదాలు యిచ్చారు. ఒక చేతితో ఆ పాదాలు పట్టుకొని స్వధర్మాన్ని ఆచరించమని చెప్పారు. అటువంటి ప్రభువుని మన యింటికి ఆహ్వానించండి.

కృష్ణా మా యింటికి రావో
గజ్జలందియలు ఘల్లు ఘల్లు మని మ్రోయంగా
బొజ్జలో యీ యేడు భువనాలు కదలంగా

వెన్నను మట్టిని సమానంగా చూశాడు కృష్ణుడు. మట్టితిన్నాడని కోపించి యశోద నీనోరు చూపమని అడగగా భువన భాండాలన్నీ నోటిలో చూసిన యశోద మూర్ఛిల్లింది. సూరే గుమ్మడికాయంత బొజ్జలో విశ్వరూపం ఉంది. అందులో మనం ఉన్నాము. యశోద మేల్కొని యితడు మానవ మాత్రుడు కాడు అనుకొనేసరికి, ఏమి తెలియనివాడికిమల్లే అమ్మా! ఆకలేస్తోంది అంటూ యశోదను మాయలో పడవేశాడు.

అఘాసురుడి ద్వారం దగ్గర ఉండి అందరినీ బయటకు లాగి రక్షించాడు. ఇప్పుడు రక్షించటం లేదా? ఎవరింటికి వచ్చేస్తాడో యేమో జాగ్రత్త!

కృష్ణుణ్ణి రమ్మనాం కదా. మీరందరూ పిలవండి. ఏ ద్వారాన వస్తాడో ఏమో! ఆయిన ఆయనకు వెనుక దారే యిష్టం. అన్ని ద్వారాలు ఆయనవే అన్ని దిశలూ ఆయనవే. ఆయన సర్వవ్యాపి కదా! **'దిశశ్చ నారాయణః విదిశశ్చ నారాయణః ఊర్ధ్వంచ నారాయణః అధశ్చ నారాయణః** అని చెప్తోంది నారాయణోపనిషత్తు. అట్టి గురునారాయణుడు అఖండ భక్తి జ్ఞానాన్ని ప్రసాదించి సర్వదా రక్షించుగాక! సుఖీభవ! సుఖీభవ!!

*

# ఆహ్వానము

## శ్రీసద్గురు పాంచాహ్నిక మహాసౌరయాగము

అఖండ నామ సంకీర్తన, సాధుధర్మ సమ్మేళనము

సమర్థ సద్గురు శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీవరప్రసాద బాబూజీ మహరాజ్‌వారి మహత్తర ఆశీర్వాదములతో, యోగిని శ్రీచంద్ర కాళీప్రసాద మాతాజీవారి ఆశీర్వాద అనుగ్రహ పర్యవేక్షణలో గుంటూరు పట్టణములో శ్రీసద్గురు పాంచాహ్నిక మహాసౌరయాగము చేయు సంకల్పమునకు దైవజ్ఞుల అంగీకారము, ఆశీర్వాదము లభించినవి.

**స్థలము** - శ్రీరామనామ క్షేత్రము, సంపత్ నగర్, గుంటూరు.

**తేదీలు 26-1-2012** గురువారం నుండి **30-1-2012** సోమవారం వరకు.

**కార్యక్రమ వివరములు -**

26-1-2012 నుండి 30-1-2012 వరకు - మహాసౌరయాగము.

27-1-2012 శుక్రవారం నుండి 29-1-2012 ఆదివారం వరకు - సాధుధర్మ సమ్మేళనము.

27-1-2012 శుక్రవారం - ఉదయం 7గం.లకు సామూహిక కుంకుమ పూజలు, రాత్రి 10-30ని॥ వివాహ ముహూర్తము.

28-1-2012 శనివారం - ఉదయం 9-30ని॥ ఉపనయన ముహూర్తము.

29-1-2012 ఆదివారం ఉదయం 7గం.లకు సామూహిక సూర్యపూజలు. ఉదయం 8గం.లకు ఉచిత వైద్య శిబిరం. రాత్రి 10-30ని॥లకు వివాహ ముహూర్తము.

30-1-2012 సోమవారం పూర్ణాహుతి. ఉదయం 10గం.లకు శ్రీసద్గురు పాదపూజ, నామకరణములు, అన్నప్రాసనలు, అక్షరాభ్యాసములు.

కావున, భక్తమహాశయులందరూ ఈ సదవకాశమును వినియోగించుకొని యాగములో పాల్గొని, మహాత్ముల అమృతబోధలను విని, దైవనామమును విని, అని, యజ్ఞప్రసాదము స్వీకరించి తరింతురు గాక యని ఆశించుచూ, భక్తులకు, జిజ్ఞాసువులకు అందరికీ హృదయపూర్వకమైన ఆహ్వానము!!

మంగళం మహత్!!

శ్రీబాబూ భక్త సమాజ్,
గుంటూరు.

# బాబూజీ మహోపదేశం

-భరద్వాజ

అది డ్రామా హాలు కాదు... వన్స్‌మోర్లు లేవు..... డి.వి. సుబ్బారావు అసలే లేడు.... అయినప్పటికీ ఆ పద్యం.... అదే జగన్నాటకానికి అద్దం పట్టిన పద్యం. తెలుగునాట ప్రతినోట తరచుగా వినిపించే పద్యం, భారతీయ వేదాంతసారాన్ని సుబోధకంగా చాటుచున్న పద్యం అచ్చుట పదే, పదే వినిపించింది. మానవజీవితం, సతీసుతుల ప్రేమ ఎంత నిజం? అందరూ ఆలోచనలో పడ్డారు. కానీ ఎంతసేపు? మళ్ళీ మామూలే.

శ్రీబాబూజీ మేడమీద సత్సంగాలు జరిగేవి. ఒక్కొక్కప్పుడు రాత్రి బాగా ప్రొద్దుపోయే వరకూ ఏదో ఒకటి చదవటం, బాబూజీ బోధ చెప్పటం జరిగేవి. అయినప్పటికీ వాటిలో పాల్గొనటం విజ్ఞానదాయకంగా, ఉత్తేజకరంగా ఉండేది. మేడ రెండో అంతస్తులో ఆరుబయట జరిగే సత్సంగ సమావేశాలు చాలా ఆహ్లాదకరంగా ఉండేవి. సాధారణంగా లైట్లు ఆర్పేసేవారు. శ్రీబాబూజీ వాలు కుర్చీలో ఆసీనులయ్యేవారు. హఠాత్తుగా ఆకాశములో మెరుపు మెరిసినప్పుడు, తిలకం దిద్దిన గురుమూర్తి ముఖారవిందం గోచర మయ్యేది. చల్లటి గాలి మధ్య రెండు క్షణాలపాటు లభించే ఆ దివ్యానుభూతి యెన్నటికీ మరువజాలనిది.

చరమాంకములో జరిగిన సత్సంగ సమావేశాలలో ఒక రోజున శ్రీబాబూజీ జగన్నాథుడి ప్రేమ ఒక్కటే నిత్యమనీ, సత్యమనీ, నిరంతర భగవన్నామ స్మరణ ద్వారా ఆయన అనుగ్రహం పొందవచ్చునని హితబోధ చేశారు. సతీసుతుల ప్రేమానురాగాలు బూటకమని హెచ్చరించేవారు. ఈ సందర్భములోనే ప్రసిద్ధమైన ..."మాయామే జగంబె నిత్యమని సంభావించి..." అను పద్యాన్ని ప్రస్తావించారు. శ్రీవెంకటరత్నంగారు దానిని భావయుక్తంగా మళ్ళీ మళ్ళీ చదివారు. కాని శ్రీబాబు సంతృప్తి చెందలేదు. శ్రీమతి కామేశ్వరమ్మగారు కూడా

రాగయుక్తంగా మళ్ళీ పద్యాన్ని పఠించారు. ఆమె చేత కూడ మళ్ళీ మళ్ళీ చదివించారు శ్రీబాబు.

"శరీరంలాగే అనిత్యమైన వాటిని గురించి లేనిపోని భ్రమలు పెట్టుకొని, కాలాన్ని, శక్తిని వృధా చేసుకోరాదని, సత్యస్వరూపమైన పరమాత్మని దర్శించటం మానవ జీవితానికి మహోన్నతమైన లక్ష్యమని" శ్రీబాబు ఆరోజున మహోపదేశం చేశారు.

అంతమాత్రం చేత సంసారాన్ని, సంఘాన్ని విస్మరించి, పరభాగ్యోప జీవిగా తయారుకావటం ఎంతమాత్రం మంచిదికాదు. స్వార్థపరత్వాన్ని, సోమరితనాన్ని, ఆధ్యాత్మిక శక్తి అంగీకరించదని శ్రీబాబు స్పష్టం చేసేవారు.

ఈ సమావేశము 1988 నవంబర్ రెండో అంతస్తులో జరిగింది. అనగా ఇక వారం పదిరోజులలో దేహత్యాగం చేయనున్న శ్రీబాబు, ఆ పరిణామాన్ని సూచన ప్రాయంగా తెలియబరచటం కోసం విషాద భరితమైన సత్యహరిశ్చంద్ర పద్యాన్ని పదేపదే చదివించి ఉంటారు. ఈ మాయా జగత్తు స్వరూప స్వభావాలను గురించి అదే మనకు హెచ్చరిక.

మన బంధుమిత్రులు, హితైషులు ఎందరో ఉండవచ్చు. కాని నిజంగా మన మేలు కోరేది సద్గురుమూర్తి ఒక్కరే. అహంకార మమకారాలను వదిలిపెట్టమని ప్రబోధించి, లక్ష్యంవైపు నడిపించి, లక్ష్య సిద్ధితో సంతసించేవారు సత్యగురుదేవులు. వేష భాషలలో వారిని అనుకరించటం వలన లాభం లేదు. సత్య గురువు బోధలను అవగాహన చేసుకుని మననం చేసుకుంటూ, వాటిని ఆచరించటం ద్వారా తనను తాను ఉద్ధరించుకోవటమే కాక, మహాత్ములు చూపిన ప్రేమ వాత్సల్యాలను సార్థకం చేసినట్లు అవుతుంది.

**అసతోమా సద్గమయ**
**తమసోమా జ్యోతిర్గమయ**
**మృత్యోర్మా అమృతం గమయ**
**ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః**

*

# సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర

(గత సంచిక తరువాయి)

- విజయేశ్వరానంద ప్రసాద్



పండితులందరి గొంతులలోను పచ్చి వెలక్కాయ పడినట్లయింది. ఒకళ్ళ మొహాలు ఒకళ్ళు చూసుకున్నారు. ఆముఖాలలో ముసి ముసి నవ్వులు మాయమైనాయి. బుర్రలు గోక్కున్నారు. ముక్కుపొడుం పట్టు దట్టించి గట్టిగా పీల్చారు. ఒక్క పొడి దగ్గు దగ్గారు. కాంతి హీనమైన ఒక నవ్వు నవ్వి" చిత్తం! చిత్తం! చాలా గొప్ప ప్రశ్న వేశారు. ఎంతైనా విచారణ చేయదగిన ప్రశ్న. తమరు ఎప్పటి వరకు ఇక్కడ ఉంటారు? ఆహా! ఏమీ లేదు, ఇప్పుడు మేము మరొక అత్యవసర కార్యక్రమాన్ని గూర్చి వెళ్ళ వలసి ఉన్నది. తిరిగి వస్తూ తమ దర్శనం మళ్ళీ చేసుకుంటాము. శెలవు'' అని అంటూ ఒక్కొక్కరే చల్లగా జారుకున్నారు.

వాళ్ళు వేసిన ప్రశ్నకు అర్థమిది. ఖండమైన జగత్తు నుండి అఖండమైన ఆత్మ వస్తువు వచ్చిందా? లేక అఖండమైన ఆత్మవస్తువు నుండి ఖండమైన జగత్తు వచ్చిందా?అని. ఖండత్వం నుండి అఖండత్వం రావడం అసంభవం. అది ఎప్పుడూ ఖండత్వమే. అఖండత్వము నుండి ఖండత్వం రానే రాదు. వస్తే అది అఖండత్వమే కాదు. వాస్తవంలో అసలు ఖండత్వమనేదే లేదు. అది కేవలము భ్రాంతి కల్పితము. ఎప్పుడూ ఉండేది అఖండత్వము ఒక్కటే.

శ్రీబాబు వేసిన ఎదురు ప్రశ్నకు అర్థమిది. ఖండత్వంలో ఉండి ప్రశ్న వేశామని వాళ్ళు అంటే, వాళ్ళు జగత్తు సత్యమని నమ్మి, దేహ భ్రాంతిలోను, జీవ భ్రాంతిలోను ఉన్నవారు. ఇట్టి భ్రాంతిమయమైన బుద్ధికి అఖండత్వం అందేది కాదు. ఇక వారు అఖండత్వంలోనే ఉన్న వారైతే, అఖండ, అభేద, నిత్య, సత్య, శుద్ధ, ముక్త స్వరూపులై ప్రజ్ఞాన పరబ్రహ్మ మూర్తులై ఉండాలి. అట్టి ఆరూఢ ప్రజ్ఞగలవానికి ఖండత్వాన్ని గూర్చిన స్ఫురణ కూడా కలిగే అవకాశం లేదు. ఇక ప్రశ్న ఎక్కడిది? కనుక శ్రీబాబు వేసిన ప్రశ్నకు వారు

ఏ జవాబు చెప్పినా, పప్పులో కాలు వేసినట్లే. అందువలనే అనుభవజ్ఞానశూన్యులైన ఆ వాచాపండితులు కాలికి బుద్ధి చెప్పారు.

వాళ్ళు అలా వెళ్ళగానే పరశురామయ్యగారు వచ్చి, శ్రీ బాబును బిగియార కౌగలించుకొని "ఎంత సులభంగా వాళ్ళకు బుద్ధి చెప్పావు బాబూ! 'వజ్రం వజ్రేన భిద్యతే' అన్నట్లు, వాళ్ళ ప్రశ్నకు, తగిన ప్రతిప్రశ్నతోనే వాళ్ళ నోళ్ళు మూయించావు. లేకపోతే, వాళ్ళు నిన్ను అఖండత్వాన్ని గురించి ప్రశ్నించేటంత అర్హత కలవారా? అక్కడికీ నేను వాళ్ళకు ముందే చెప్పాను 'కొండను ఢీకొనకండి, పిండి పిండి అయిపోగలర'ని. వింటేనా? బుద్ధిహీనులు. వాళ్ళకు ఈ శాస్తి జరగవలసిందే" అని పగలబడి నవ్వారు. శ్రీ బాబుకు దిష్టి తీయటానికి వీశెడు మిరపకాయలు కూడ చాలలేదు పరశురామయ్యగారికి.

తమకు లభించిన అపురూపభాగ్యాన్ని స్మరించుకున్నట్లుగా, శ్రీ పరశురామయ్యగారు మాటి మాటికీ -

**"జలజాత ప్రభవాదులున్ మనములో జర్చించి భాషావళిన్**
**బలుకన్‌రాని జనార్ధనాహ్వాయ పరబ్రహ్మంబు నీయింటిలో**
**చెలియై, మేనమరందియై, సచివుడై, చిత్తప్రియుండై మహా**
**ఫల సంధాయకుడై చరించుటది నీ భాగ్యంబు రాజోత్తమా"**

అని భారతంలోని పద్యాన్ని పాడుకుంటూ ఉండేవారు. అన్ని కష్టసుఖాలలోను తమకు తోడునీడగా శ్రీకృష్ణపరమాత్మ నిలచి ఉండటాన్ని ధర్మరాజుకు గుర్తుచేస్తూ, పాండవుల మహాభాగ్యాన్ని ప్రశంసిస్తూ నారదుడు అన్న మాటలివి.

అవును మరి! ఆ ధర్మరాజుకి, పాండవులకు అబ్బినంతటి మహద్భాగ్యము తనకబ్బినపుడు, ఎవరికి ఆనందం కలుగదు? నిరంతరము పరమ పురుషుడని, పరంధాముడని, ఆత్మారాముడని నెరనమ్మిన ఆ దివ్యమంగళమూర్తి స్వరూపమే శ్రీబాబుగా తన ఇంట వెలసి, తమందరితోను కలసి మెలసి, తన్నులరిస్తూ ఉంటే , ఆ అపూర్వభాగ్యానికి ఉబ్బి తబ్బిబ్బు కాకుండ ఎవరుండగలరు?

-సశేషం

# మౌన ధ్యాన శిబిరం

- రమణ ప్రసాద్

శ్రీగురుదేవులతో సాంగత్యం, వారితోకలిసి ఉండటం, వారి సన్నిధానంలో సంభాషణ, వారు చూపించిన మార్గదర్శకత్వం, తదనుభూతి, ఎన్ని సంవత్సరాలైనా నిత్యనూతనంగా ఉంటుంది. ఎవరైతే గురుపాదాన్ని ఆశ్రయించి సాధన చేస్తున్నారో వారికి గురుబోధామృతం అందుతుంది.

రాధాకృష్ణుల ఆలయంలో చూడండి. రాధమ్మతల్లి కృష్ణునిపాదాలవైపు చూస్తూ, మీరు కూడా ఈ పాదాలను ఆశ్రయించండి అని చెపుతోంది. ఆవేదనతో ఉన్న హృదయానికి అనుభూతి కావాలి. మన దోషాలను ప్రభువుకి చెబితే ఆయన తప్పక రక్షిస్తాడు.

**హరి నీవే సర్వాత్మకుడవు, స్థిరమగు భావననీయగదే ।**

మనస్సు ఎక్కడ నిలిస్తే బాగుంటుంది? నిద్ర పోతేనా? మూడు గంటలు భజన చేస్తేనా? బ్యాంకు బ్యాలెన్స్‌లో కోట్లు ఉంటే బాగుంటుందా? ఏమీ బాగోదు. మనం దేనిని కోరుకోవాలి?

పారక మానదు పాపపు మనసిది ఈ రసములలో ఎందైనా
నీరజాక్ష! ఇది నీ మహిమేనని (నీమయమేనని) ఈ రీతుల
తలపీయగదే ।హరి।

హరి నీవే - ఈదంతా నీవే అనే భావనలో మనస్సు నిలిపి ఉంచాలి. ప్రపంచంవైపు ఉన్న మనస్సును భగవంతునిపైకి మరల్చాలి. నీరజాక్ష ! అనే చోట గళం నిలిపేవారు శ్రీ గురుదేవులు. అది భావనలోకి తెచ్చుకుంటే ఆ అనుభూతి ఇప్పుడుకూడా కలుగుతుంది.

ఈగ అన్నిటిపై వ్రాలుతుంది. అది అశుద్ధంపైనా వ్రాలుతుంది. జిలేబీ పైనా వ్రాలుతుంది. అది తిన్నవాళ్ళకు వ్యాధులు తథ్యం. మరి తేనెటీగ!అది డైరెక్ట్‌గా పుష్పాలపై వ్రాలి మకరందాన్ని సేకరిస్తుంది. సేకరించి ఏం చేస్తుంది? మనకే ఇస్తుంది.

చూడకమానవు చూచెడి కన్నులు ఏడనేదైన ఇతరములు
ఈడనన్నింట నీ రూపముగన ఈడులేని తెలివీయగదే ।హరి।
కలుగకమానవు కాయపు సుఖములు ఇలలోపల నెన్నైనా
అలరిన వేంకటాధిప నీకే ఇలనర్పితమగు నిజమీయగదే ।హరి।

మనసు స్వాధీనమైనవారికి మంత్ర తంత్రములేల? **ఇంద్రియాణాం మనశ్చాస్మి** - అన్నాడు శ్రీకృష్ణ భగవానుడు. మనస్సును భగవంతునికి

అర్పించు. మనం భగవంతుణ్ణి ప్రేమించాలి. భగవత్ప్రాప్తినే కోరుకోవాలి. కాని మనం అవీ, ఇవీ కోరుకుంటాం.

ఆత్మస్వరూపుడు శ్రీరాముడైతే ఆత్మానందాన్ని అనుభవించేది సీత. సీత అంటే ప్రకృతి. ఆయన చైతన్యస్వరూపుడు. అంతటా అయనే నిండి ఉన్నాడు. ప్రభూ! నువ్వు మా వెంట ఉండి నడిపిస్తున్నావు - అని గుర్తించటమే శ్రీ సీతారాముల లీలా కళ్యాణంలోని అంతరార్థం.

శ్రీరాముడు ధనుర్భంగం చేస్తున్నప్పుడు తోటివారు చెప్పారట సీతమ్మకు "నీకోసమే పుట్టినట్లు ఉన్నాడమ్మా! అందగాడమ్మా! సకలగుణాభిరాముడమ్మా!"అని. అమ్మకూడా శ్రీరాముణ్ణి ఉద్యానవనంలో అలఓకగా చూసింది. ఆయనా సీతమ్మను చూశాడు. అమ్మకు తెలుసు. శివ ధనుర్భంగం రాముడే చేయగలడని. శ్రీరాముడు గుర్వాజ్ఞను పొంది చిటికినవేలుతో ఎక్కుపెట్టాడో లేదో ధనుస్సు ఫెళ ఫెళ మని విరిగింది. అలా చేయగలిగినవాడు పురుషోత్తముడైన శ్రీరాముడొక్కడే. అమ్మ ఒళ్ళు ఝల్లుమంది. శ్రీరాముడి మెడలో దండ వేసింది.

శ్రీగురుదేవులు తెరతీయగానే అమ్మను ఎంత ఆనందంగా చూసుకునేవారో! శ్రీరాముడుకూడా ఆనందంగా అమ్మను చూసుకున్నాడు.

శ్రీగురుదేవులు మనని వెంట ఉండి నడిపిస్తున్నారు. సీత భూజాత అంటే భూమి తత్వం. పాంచభౌతికమైన రూపం ధరించి మానవులను తరింపచేయటానికే వారు అవతారం ధరించి వచ్చారు. నీ మనస్సు ఎప్పుడు లయమవుతుందో అప్పుడు నువ్వు భగవంతునిలోనే ఉంటావు. **నివసిష్యసి మయ్యేవ అత ఊర్ధ్వం న సంశయః-** అన్నాడు భగవానుడు. "నువ్వు నాలోనే ఉంటావు, అందులో ఏమాత్రం సంశయం లేదు" అని. అటువంటి ఆనందాన్ని పొందే అవకాశం మనకి గత ఏడు రోజులుగా మనకు శ్రీగురుదేవులు ప్రసాదించారు. ఇక్కడతో ధ్యానం అయిపోతుందా? ఆ పాదాలను మనస్సులో ముద్రించుకుని ధ్యానం చేస్తూఉంటే మనకు నిత్యసత్యాన్ని తెలియచేస్తాయి ఆ పాదాలు.

భగమన్నామం చేస్తూ ఆ నాదంలో ప్రణవనాదాన్ని వినగలవారే ధన్యజీవులు. అటువంటి ఆత్మరతిని పొందే భాగ్యాన్ని, అఖండ భక్తి జ్ఞాన వైరాగ్యాలను, ఆత్మానందాన్ని శ్రీగురుదేవులు మనకందరికీ ప్రసాదించుగాక! సుఖీభవ! సుఖీభవ!!

■

# బాబు తత్త్వమే తిరుప్పావై

-సుషుమ్న ప్రసాద

వైష్ణవ సాంప్రదాయంలో శ్రీగోదాదేవి లేక ఆండాళ్ తల్లి రచించిన 'తిరుప్పావై' వేద బీజముగ పరిగణింప బడుతోంది. వేదాలు జీవాత్మ సౌలభ్యముతో పరమాత్మను చేరుకోనే అనేక మార్గములను సూచిస్తోంది. తిరుప్పావై ముప్పది పాసురములలో ఆ సత్యాన్నే వర్ణిస్తోంది. మరొక విధంగా చెప్పాలంటే 29పాసురములు జీవాత్మ పరమాత్మను చేరుకొనే సోపానములైతే, ముప్పదవ పాసురము ఫలశ్రుతిని చెప్తుంది.

తమిళనాడులోని శ్రీవిల్లిపుత్తూరు గ్రామమున పెరియాళ్వారుగా ప్రసిద్ధి చెందిన విష్ణుచిత్తుని యొక్క దత్తపుత్రిక అండాళమ్మ తల్లి. ఆమె తాను మర్త్యుని వివాహమాడనని, శ్రీరంగములో వెలసిన శ్రీరంగనాథ స్వామినే పరిణయమాడతానని తన తండ్రితో కచ్చితంగా చెప్పింది. పెరియాళ్వారు అసాధారణము, అసాధ్యమయిన తన తనయ కోరికకు కలత చెంది, ఆమె నిర్ణయమును మార్చటానికి ప్రయత్నించాడు. కాని గోదాదేవి తన అచంచల నిర్ణయము మార్చుకోలేదు.

తన గమ్యమును సాధించటానికి అన్ని పవిత్ర గ్రంధములను తన తండ్రి వద్దనే నేర్చుకొన్నది. కృష్ణ భగవానుని పొందుటకు బృందావనంలో గోపికలు చేసిన కాత్యాయనీ వ్రతమును తెలుసుకున్నారు. ఆ పంథాలో ఆండాళ్ తల్లి ఆ కాత్యాయనీ వ్రతమును ఆచరించాలనుకొన్నది. శ్రీవిల్లిపుత్తూరును బృందావనముగా, అక్కడ ఆరాధ్యదైవమైన వటపత్రశాయిని కృష్ణపరమాత్మగా, తన స్నేహితులను గోపికలుగ భావించుకుని, ముప్పది పాసురాలలో ఆ వ్రతమును ఎలా ఆచరించారో, తత్ఫలితముగా కృష్ణపరమాత్మ శాశ్వత సాంగత్యమునకెలా పాత్రులు అయ్యారో వర్ణించింది.

మొదటి ఐదు పాసురములు 'పరమ్', వ్యూహము, 'విభవము', 'అంతర్యామి', 'అర్చ' అనే పరమాత్మ నివాసములకు సంబంధించినవి. 'పరమ్' స్థితిలో, పరమాత్మ సన్నిధిలో వైకుంఠమునందు నిత్యసురులు, శ్రీమన్నారాయణుని పాదకమల సేవ చేస్తూ, శ్రీ మహాలక్ష్మి ఉంటారు. ఆ వైకుంఠ నిలయమును, సనక, సనందనాదులు, సప్తఋషులు తప్ప మిగిలిన

యోగులు, మహాత్ములు చేరుకొనుటకు కూడా దుష్కరమని పరమాత్మ అపార కృపతో 'వ్యూహము' అనే స్థితికి దిగి వచ్చారు. ఇక్కడ క్షీర సముద్రములో ఆదిశేషునిపై పవ్వళించి, శ్రీమహాలక్ష్మి పాదసేవ నాచరిస్తుంటుంది కాని యిక్కడకు బ్రహ్మనాయకుడుగా దేవతలు, ఋషులకు తప్ప మర్త్యుల చేరుకొనుట దుర్లభమైనది.

అప్పుడు పరమాత్మ జీవులను తరింపజేయటానికి తానే వారితో కలసి అవతరించాలనుకొన్నాడు. కాని యిది కూడ ఆ కాలములో జీవించినవారికి మాత్రమే పరిమితమైనది. అప్పుడు భగవానుడు 'అంతర్యామి'గా మానవుల హృదయాంతరాళములలో నివాస మేర్పరచుకొందా మనుకున్నాడు. కాని మాయా బంధములో చిక్కుకొన్న మానవుడు, దృష్టి అంతర్ముఖము చేసుకోనందువలన, పరమాత్మను తమలో దర్శించలేక పోయారు. అప్పుడు చివరిగా శ్రీమన్నారాయణమూర్తి, జీవులందరికి అందుబాటులో ఉండేటట్లు 'అర్చ' రూపము (విగ్రహంగా) ధరించాడు. తద్వారా 'అర్చామూర్తి'కి సేవలు చేసుకొని, ఆత్మాసాక్షాత్కారము పొందటానికి అవకాశమిచ్చాడు.

ఆండాళ్ తల్లి మొదటి ఐదు పాసురములలో ఐదు నివాసములను గురించి వర్ణిస్తుంది. మానవులు జీవిత పరమార్థమును 'పరమ్', 'వ్యూహమ్', 'విభవము', 'అంతర్యామి', 'అర్చ' అనే యే స్థితులపై మనసు లగ్నముచేసి, యెలా సాధించాలో సూచిస్తుంది.

వ్రతము ఆరవ పాసురము నుండి ప్రారంభమవుతుంది. అందులో ఆండాళ్ తల్లి జీవులు మహాత్ములతో సత్సాంగత్యము చేసి, తరువాత జీవులు పరమాత్మను చేరుకొంటారని ప్రబోధిస్తుంది. తరువాత పది పాసురములలో తను, మధురకవి తప్ప, పదిమంది ఆళ్వారులకొక్కరికిని మేలుకొల్పే వర్ణన నిండి ఉన్నవి. తాము పొందిన ఆ బ్రహ్మానందమును యితరులతో పంచుకోవాలని సూచిస్తుంది. ఆళ్వారులు పదిమంది శ్రీమన్నారాయణుని ఆంతరంగిక భక్తులు. వారెల్లప్పుడూ, భగవదనుభూతిలో లీనమయి ఉండేవారు. 'ఆండాళ్' తల్లి ఆళ్వారులతో సహకరిస్తే, మానవులు భగవంతుని చేరుకొనే మార్గము సుగమమవుతుందని హేతుబద్ధంగా వివరిస్తుంది.

-సశేషం

# అమెరికాలో మాతాజీ బోధ

(గత సంచిక తరువాయి)

-పరాశర ప్రసాద్

శ్రీమాతాజీ భక్తులకు బోధ చేస్తూ పాడాలని ఉంది. ఎలా పాడాలో తెలుసు. పాటను పాడే గొంతుక బాగానే ఉంది. కాని రాపిడి చేత స్వల్పమైన అస్వస్థత చేత గొంతుకలో అడ్డుపడి పాట పాడటానికి అంతరాయం కలిగింది.

భగవంతునిపై లగ్నం చేసి ధ్యానం చేయాలనో, లేక సంకీర్తనలో పాల్గొనాలనో లేక బోధా శ్రవణం చేయాలనో భావన చేసే మనస్సు ప్రాపంచిక వ్యవహారాలలో మునిగిపోయి అలసట చెంది సహకరించదు. అంతెందుకు మీరందరూ ఉద్యోగస్థులే కదా! పని వత్తిడి ఎక్కువగా ఉన్నప్పుడు పగలు రాత్రి అని తేడా లేక కష్టపడి పని చేస్తారు. తరువాత శరీర శ్రమకి లోనై ఆఫీసులో నిద్రపోయారనుకోండి, మీకు రిమార్కు వస్తుంది కదా! దానితో ఆగదు కదా! జీతం కట్ చేస్తారు.

అలాగే భగవానుడు కూడా మనందరికి జీవితాన్ని ప్రసాదించి, ఒక నిర్దిష్టమైన విధానాన్ని ఏర్పరిచాడు. రాత్రి సమయంలో కావలసినంత విశ్రాంతి తీసుకోవచ్చు. మరి పగటి సమయం ఒక దైవ సంబంధిత కార్యక్రమాన్ని పెట్టుకుని దానికి యివ్వవలసిన విలువ యివ్వాలి కదా! పగలు నిదుర పోకూడదు కదా! అంతేకాదు పగలు ఏదో, రాత్రి ఏదో గుర్తించే స్థితిలో ఉన్నారు కదా! దానికి భిన్నంగా ప్రవర్తిస్తే కేవలం అది సోమరితనమే.

మన గురుదేవులు సోమరితనమే అజ్ఞానమని చెప్పేవారు. గురుదేవులు బోధించిన దానిని అర్థం చేసుకోలేక ఆచరించక పోవటమే అజ్ఞానం. మనం కాలంలో ఉన్నా, మనకి కాలం ఏమాత్రం లోటు చేయటం లేదుకదా! ఏ కార్యక్రమానికి ఎంతకాలాన్ని వినియోగించాలో తెలుసుకునే మేధాశక్తి భగవానుడు ప్రతి మానవునికి ప్రసాదించి, మన జీవితానికి కావలసిన సర్దుబాటు చేశాడు. దానిని సక్రమంగా నడిపించుకోవటం మన వంతు.

ధనాన్ని ఆర్జించవద్దని ఎవ్వరూ చెప్పరు. కావలసినంత ధనాన్ని ఆర్జించవచ్చు. ప్రపంచం మనని బంధువులు, మిత్రుల రూపంలో బాగా తినమని, హాయిగా జీవితాన్ని అనుభవించమని, బాగా నిదురపొమ్మని ప్రలోభపెడుతుంది. భగవానుడు మనకు జీవితాన్ని ప్రసాదించింది దాని కోసం

కాదు కదా! ఈ దేహం నాది అని భావన చేయని మానవుడు ఎవరైనా ఉన్నారా! ఈ దేహాన్ని ప్రకాశింపజేసే ప్రభువు నాది అని ఎందుకు భావన చేయలేక పోతున్నాడు?

మానవుడు దేవాలయానికి వెళ్ళినా లేదా ఏదైనా దివ్య క్షేత్రానికి వెళ్ళినా అక్కడ ప్రతిష్టితమైన దైవాన్ని దర్శించి ఆనందిస్తాడు కదా! ఆ దైవాన్ని సేవించేవాడిని చూసి అసూయ చెందకూడదు. దానికి మానసిక దౌర్భల్యమే కారణము. ఆ దైవాన్ని సేవించేవారి సంగతి ఎలా ఉన్నా, దైవ దర్శనానికి వెళ్ళిన భక్తులకు, దైవము స్పర్శచేతగాని, దృష్టిచేత గాని తన అనుగ్రహాన్ని అందజేయడా!

మానసిక దౌర్భల్యానికి కారణము మనస్సును ఆవరించిన ఆవరణ దోషమే. అదే మనోమాలిన్యము. అది బంధనకి కారణమవుతుంది. మనస్సు చంచలమైనదే. దానిని మన అదుపులోనికి తెచ్చుకోవటానికి అభ్యాసము ద్వారా, వైరాగ్యము ద్వారా సాధ్యపడుతుందని కృష్ణభగవానుడు భగవద్గీతలో శెలవిచ్చాడు.

మన దేహము ప్రకృతిలోనిదే కదా! దానికి పరిణామము తప్పదు. ఆ మార్పును గుర్తించి, కార్యాచరణలో మార్పు తెచ్చుకోవాలి. మన జీవిత పరమార్ధము జన్మరాహిత్యాన్ని సాధించాలనేగా. కాబట్టి జన్మని తీసుకువచ్చే ఏ అవరోధాన్నైనా త్యజించవలసినదే.

రెండవ వస్తువు ఉన్నదనే భావనే ద్వైతము. అదే ద్వేష భావన అసహానానికి కారణమవుతుంది. మన ప్రవర్తనలో మార్పు రావాలి. పాలు తోడు పెట్టిన వెంటనే తోడుకోవు కదా!

కాలం వెళ్ళిపోతుంది. పోయిన కాలం తిరిగి రాదు. ఎటువంటి పరిస్థితిని ఎదుర్కొనవలసి వచ్చినా నీలో నీచ భావన తలెత్తకూడదు. భగవంతుడు అందరినీ సమానంగా ప్రేమిస్తాడు.

భగవంతుని సేవ తత్త్వపూరితంగా చేస్తే తరువాత భక్తుల సేవ చేయగలుగుతావు. బాహ్యపూజ, అలంకరణ, సేవలో భగవన్నామ స్మరణ మరవటానికి అవకాశం ఉంది. కాని మానసిక ఆరాధనలో అటువంటివి అసంభవము. అటువంటి సాధన సంపత్తిని, అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యాలను, అఖండైశ్వర్య భోగభాగ్యాలను ప్రసాదించి గురుపాదుకలు సర్వదా కాపాడుగాక! సుఖీభవ!! సుఖీభవ!!




(గత సంచిక తరువాయి) -రమణ ప్రసాద్

తప్త కుండ జలాలలో తన ముఖం చూసుకొన్నాడు. ఈ జలాలలో నారదుడు తన ముఖం చూసిన తరువాతనే మోహ ముక్తుడైనాడు - అందువలననే దీనికి నారదకుండ్ అని పేరు వచ్చింది. ఇందులో నారదుని ముఖం ఇప్పుడు కనిపించటం లేదు. కాని ఇక్కడ మోహం ఒక్క క్షణమైనా నిలవలేదు అనుకొన్నాడు ఉద్ధవుడు.

అర్జునుడు ఏ క్షణాన కృష్ణుని దేహత్యాగ వృత్తాంతము ఉద్ధవునికి తెలిపాడో, ఆ క్షణంనుంచే శూన్యతాభావం ఉద్ధవుణ్ణి ఆవరించింది. గంగాతటంపైన కృష్ణ విహీనుడైన యుగాన్ని ఆరంభం గురించి అర్జునుడు అన్నాడు. జ్ఞాని అయిన ఉద్ధవుడు కూడా ఎన్నడూ కృష్ణహీన యుగాన్ని కల్పన కూడా చేయలేదు. ఇప్పుడు అదే వాస్తవికత అయింది.

ఒక మహాయుగం అస్తమించింది. దానిని ఎన్నినాళ్ళనుంచో ఉద్ధవుడు తన మనో నేత్రంతో చూస్తున్నాడు - ఈ సమస్త ప్రకృతి సూర్యచంద్రులు, నక్షత్రాలు, గాలి, ఆకాశం, ప్రవహించే నదులు, ఈ వనాలు - అన్నీ యధాప్రకారంగానే ఉన్నాయి.... అంతా నిశ్శబ్దం. అంతా శూన్యం. ఆ శూన్యంలో నుంచి హాహాకారం! నెమలిపింఛం రంగు ఎక్కడి నుంచో వస్తున్న వేణునాదం - ఇవన్నీ ముందులాగా లేవు. ఆవు దేహాన్ని విదిలించుకోవటం, లేగల అంబారవాలలో ఏదో మార్పు కనిపిస్తోంది.

ఉద్ధవుని ఎదుట అర్జునుని వ్యగ్రత... అశ్వత్థామ ఛీత్కారం...అక్రూరుని వేదన... ఇంకా ....ఇంకా.... వ్రజభూమిలో స్తబ్దంగా నుంచున్న తమాల వృక్షం... కదంబ వృక్షం... గోవర్ధన పర్వత శ్రేణులు...అవన్నీ అతనిముందు నిలిచాయి.

-"ఉద్ధవా! ప్రేమ కరుణను మించిన విలువైన ధర్మం ఏదీ లేదు!

ఇదే నీతి, ఇదే ధర్మం! ఆసక్తియే స్నేహం..... ఆసక్తి రహితమైన ప్రేమయే కరుణ...'' అని కృష్ణుడు చెప్పి ఉన్నాడు. ఆయన ఆర్షద్రష్ట కదా! ఉద్ధవుని భవిష్యత్తు ఆయన ముందే తెలిసికొన్నాడు. ఆసక్తి శూన్యత , అసక్తి ఉద్ధవుణ్ణి లోబరుచుకోకముందే ఉద్ధవుణ్ణి హెచ్చరించాడు.

రాధను కలిసేంతవరకు తన కర్తవ్యం నుండి ముక్తుడు కాలేడు. ఆక్షణాన్ని ఎలా ఎదుర్కోవాలో తెలియక తికమక పడ్డాడో ఆక్షణం ఎంత సహజంగా రాధ వద్ద గడిచిపోయింది! తను అనవసరంగా ఎలా వ్యగ్రత పొందాడు...ఉద్ధవుడు లజ్జితుడైనాడు! రాధ ఆ క్షణాన్ని స్వీకరించనేలేదు... కృష్ణ రహిత విశ్వం రాధకు ఎన్నడూ లేదు, ఎన్నడూ ఉండదు....

రాధయొక్క కృష్ణమయ విశ్వం యొక్క సంస్పర్శతో ఉద్ధవునిలోని శూన్యత, ఆసక్తి ఈ రెండూ పాము కుబుసం వదలినట్లు వదిలివేశాయి... ఉద్ధవుడు గోకులం వదలి బదరీధామం వైపు వెళ్తున్నప్పుడు గాలికంటె ఎంతో తేలికగా అయినట్లు అనుభవం పొందాడు.

బదరీధామం! నెమ్మదిగా నెమ్మదిగా అడుగులు వేసికొంటూ మందిరంలోని గర్భద్వారంలోకి ప్రవేశించి బదరీనాధ భగవానుని మూర్తిముందు నుంచుని ఉన్నాడు... ఆ మందిరంలోని గంటలను మ్రోగించాడు... ఉద్ధవుడు చేతులు జోడించి కనులు మూసికొన్నాడు... మూసిన కనుల ఎదుట ఒక తేజపుంజం మెరిసింది. కనులు తెరవగానే ఎదురుగా ప్రకాశంతో తేజరిల్లుతున్న బదరీనాధుడు సాక్షాత్కరించాడు.

ఉద్ధవుని పెదవులపై దరహాసం విరిసింది.

బదరీనాధుని ప్రతిమ పారసమణితో చేయబడింది... దాని స్పర్శతో ఏ వస్తువైనా బంగారంగా మారుతుంది. హిమాలయంలోని పతిత పావనమైన శీత శిఖరం మంచుతో కప్పబడలేదు. బంగారంతో కప్పబడింది. కాళ్ళ దగ్గరగా ప్రవహించే అలకనంద నీరు కరిగిన మంచు కాదు. శిఖరాలనుంచి ప్రవహించిన స్వర్ణధార....

ఉద్ధవుడు రోమాంచితుడైనాడు. అతని రోమరోమాలు ప్రఫుల్లితమైనాయి. అతను కనులు స్థిరంగా నిలిచాయి. బదరీనాధుని బదులుగా అతనికి కృష్ణుడు కనిపించాడు.

అదే నెమలి పింఛం...అదే వేణువు...అదే భువన మోహనమైన రూపము... కాలాతీతము, కరుణార్ద్రమైన చిరునవ్వు...అదే విశ్వవ్యాప్తమైన విశ్వరూపసందర్శనము...!

"కృష్ణా!.." ఉద్ధవుని పెదవులు కదిలాయి... ఆయన కళ్ళు చెమ్మగిల్లాయి.... ఎదుట ఉన్న కృష్ణ ప్రతిమ కన్నీటివల్ల మసకమసకగా కనిపిస్తోంది. ఏమిటి? కృష్ణుడు కూడా పెదిమలు విప్పి మాట్లాడుతున్నాడు? ఎక్కడినుంచి వస్తోంది ఈ ధ్వని? బదరి నాధుని ప్రతిమ ఏమైంది?...

"ఉద్ధవా! మౌనం, వాణికి దండం, నిష్కామ కర్మ, దేహానికి దండం, ప్రాణాయామం, చిత్తానికి దండం! ఈ త్రివిధ దండాలను ధారణ చేసినవాడే నిజమైన దండి, అతడే నిజమైన సన్యాసి! సన్యాసధారణ చేసి నువ్వు దేనిని పొందాలనుకుంటున్నావో ఆ అమృతానుభవాన్ని పొందలేవా మహాత్మా?"

-సశేషం

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ చిరకాల భక్తులు, ఆశ్రమ స్థిరనివాసులు, అయిన దేవకి బ్రహ్మయ్యగారు 1-10-2011 శనివారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరు గత కొన్ని సంవత్సరాలుగా అస్వస్థులుగా ఉన్నారు. వీరు పూర్వం ఆశ్రమంలో క్యాంటిన్‌లో భక్తులకు ఫలహార భోజన సదుపాయాలు అందించేవారు. వీరి వయస్సు 80 సంవత్సరాలు. వీరికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు కలరు.

సద్గురు దేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరుగాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

Printed, Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL